

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 14-03-2025 | సంపుటి - 21 సంచిక - 322 రూ : 4 పేజీలు: 8



## ప్రతి నియోజకవర్గంలో
# 10వేల ఇళ్లపై 'సౌర'భాలు

- ప్యానళ్లు పెట్టించే బాధ్యత ఆయా ఎమ్మెల్యేలదే
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితం.. బీసీలకు రూ.80వేల వరకూ రాయితీ
- వ్యవసాయ మోటార్లకూ సౌర విద్యుత్తు
- శాసనసభలో సీఎం చంద్రబాబు

అమరావతి : రాష్ట్రంలో ఒక్కో నియోజకవర్గంలో 10వేల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానల్స్ పెట్టించే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఎమ్మెల్యేలు తమతమ నియోజకవర్గాల్లో అగ్రిగేటర్ల ద్వారా అందరికీ అవగాహన కల్పించాలని, ఇళ్ల యజమానుల నుంచి సమ్మతి లేఖలు తీసుకోవాలని కోరారు. యజమానులు అనుమతి లేఖలు ఇస్తే కాంట్రాక్టు సంస్థలు వచ్చి ప్యానళ్లు బిగిస్తాయని సూచించారు. ఈ ఏడాది 20 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇవన్నీ పూర్తయితే 4వేల మెగావాట్ల విద్యుత్తు వస్తుందని వెల్లడించారు. శాసనసభలో గురువారం విద్యుత్తు రంగంపై నిర్వహించిన స్వల్పకాలిక చర్చకు ఆయన సమాధానమిస్తూ "పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ప్రతి ఇంట్లో విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చు. రాష్ట్రంలో 25 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇంటిపై రెండు కిలోవాట్ల సౌరవిద్యుత్తు ప్యానళ్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. దీంతో 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దీనికి రూ.1.15 లక్షల కోట్లు ఖర్చవుతుంది. కేంద్రం రూ.65వేల కోట్లు ఇస్తుండగా.. ఏపీ ప్రభుత్వం రూ.55వేల కోట్లు భరిస్తుంది. ఇంటికి

తరువాయి 2లో

## భారత్ సమ్మిట్‌కు..
# అనుమతులివ్వండి!

- కేంద్ర మంత్రి జైశంకర్‌కు సీఎం వినతి

ఢిల్లీ: హైదరాబాద్ వేదికగా ఏప్రిల్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించబోతున్న భారత్ సమ్మిట్‌కు కేంద్రం నుంచి అనుమతులు ఇప్పించాలని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఆయన గురువారం ఢిల్లీలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్‌ఖుర్షీద్, ఎంపీలు మల్లురవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్‌లతో జైశంకర్‌ను కలిశారు. ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున దౌత్య, లాజిస్టిక్‌పరమైన సాయంతో దీని విజయవంతానికి సహకారం అందించాలని కోరారు. ఈ సమ్మిట్ ఆధారంగా రానున్న 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం దార్శనికపత్రం తయారు చేయబోతున్నట్లు జైశంకర్‌కు తెలిపారు. అలాగే ఈ ఏడాది హైదరాబాద్‌లో జరగనున్న మిస్‌వరల్డ్ పోటీలు, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, ఇండియా జాయ్ (యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్, వినోద పరిశ్రమ) ఫెస్ట్ వివరాలను ఆయనకు రేవంత్ వివరించారు. ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల నిర్వహణకు సహకారం అందించడం ద్వారా తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి తరువాయి 2లో




## ఇది వేర్పాటువాద
# మనస్తత్వాన్ని చాటుతోంది



- డీఎంకేపై విమర్శలు గుప్పించిన నిర్మల

ఢిల్లీ: తమిళనాడు బడ్జెట్ పత్రాల్లో రూపాయి గుర్తును (Rs) తొలగించి.. రూ.అనే అర్థం వచ్చే అక్షరాన్ని చేర్చిన వ్యవహారంపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. ఒకవేళ ఆ గుర్తుతో ఇబ్బంది ఉంటే.. 2010లో దాన్ని కేంద్రం అధికారికంగా ఆమోదించిన సమయంలో ఎందుకు వ్యతిరేకించలేదని డీఎంకేను 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వంలో డీఎంకే భాగస్వామ్యపక్షంగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. '₹' సింబల్‌ను రూపొందించిన వ్యక్తి డీఎంకే మాజీ ఎమ్మెల్యే తనయుడే కావడం గమనార్హమన్నారు. "రూపా యి చిహ్నం '₹' అంతర్జాతీయంగా బాగా గుర్తింపు పొందింది. యూపీఐ సేవలను అంతర్జాతీయం చేసేందుకు భారత్ తరువాయి 2లో



## రేషన్‌కార్డులు
## ఇక బీపీఎల్, ఏపీఎల్

- ఏప్రిల్‌లో కొత్త కార్డుల జారీ!
- ఎస్ఎల్‌బీసీ ప్రమాదకర ప్రాంతంలో రోబోల వాడకం
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్: రేషన్ కార్డులు ఇక రెండు రకాలుగా ఉంటాయని పౌరసరఫరాలు, నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచనప్రాయంగా తెలిపారు. దారిద్ర్యరేఖకు

తరువాయి 2లో

# నేడు గ్రూప్-3 ఫలితాలు

హైదరాబాద్: రాష్ట్రంలో 1,365 గ్రూప్-3 సర్వీసుల పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షల ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. ఇప్పటికే షెడ్యూలు ప్రకారం ఈ నెల 10, 11 తరువాయి 2లో




## దక్షిణాది హక్కుల కోసం
## కిషన్‌రెడ్డి పోరాడాలి

- కేంద్ర క్యాబినెట్‌లో ప్రస్తావించాలి
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఉత్తరాదికంటే కేంద్రానికి ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నామని వెల్లడి
- మెట్రో, మూసీ, ఆర్‌ఆర్‌ఆర్ లాంటి ప్రాజెక్టులకే నిధులడుగుతున్నామని స్పష్టం

2లో





## మహిళా సారథ్యంలో
# భారత్ అభివృద్ధి..


: ఐరాస సదస్సులో కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి

ఐక్యరాజ్యసమితి: భారత అభివృద్ధికి మహిళలే నేతృత్వం వహిస్తున్నారని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ఆలోచన నుంచి అమలు, పర్యవేక్షణ వరకూ అన్ని స్థాయిల్లో మహిళల క్రియాశీల భాగస్వామ్యం ఉంటోందని చెప్పారు. బుధవారం 'ఐరాస కమిషన్ ఆన్ ద స్టేటస్ తరువాయి 2లో

## ఫ్రీహోల్డ్ పేరిట
# పేదల భూముల్ని కొట్టేశారు

: వైకాపా ప్రభుత్వంలో అక్రమాల పర్వం

- కబ్జాలను అణచివేసేలా కొత్త చట్టం
- శాసనసభలో హోంశాఖ మంత్రి అనిత



అమరావతి: 'రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను జగన్ అస్తవ్యస్తం చేశారు. ఎన్నడూ గ్రామసభలు నిర్వహించలేదు. బడుగు బలహీన వర్గాలకు మేలు చేస్తామని, ఎసైన్డ్ భూముల్ని 22ఎ నుంచి తొలగించి ఫ్రీహోల్డ్ చేస్తామని నమ్మబలికారు. ప్రభుత్వ, ఎసైన్డ్ భూముల్ని ఫ్రీ హోల్డ్ చేసి వైకాపా నేతల పేర్లతో రాయించుకున్నారు. ఫ్రీహోల్డ్‌కు ముందే అమాయకులైన ఎసైన్డ్ భూముల యజమానులకు ఆశ చూపించి కారుచౌకగా కొట్టేశారు'

తరువాయి 2లో

# దక్షిణాది హక్కుల కోసం కిషన్‌రెడ్డి పోరాడాలి



దిల్లీ: కేంద్రం చేయబోయేది నియోజకవర్గాల మదింపు కాదు... దక్షిణాది రాష్ట్రాల రాజకీయ శక్తి కుదింపు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. డీలిమిటేషన్ దక్షిణాది ప్రజల ప్రాథమిక హక్కులను ప్రభావితం చేస్తున్నందున దాని గురించి కేంద్ర క్యాబినెట్‌లో ప్రస్తావించాల్సిన బాధ్యత రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ఉందని అన్నారు. దక్షిణాది నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన ప్రజల హక్కులకోసం పోరాడాలని సూచించారు. దిల్లీలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ''దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత తెలంగాణ భాజపా నేతలపై కూడా ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసే అఖిలపక్ష సమావేశానికి తెలంగాణ భాజపా అధ్యక్షుడి హోదాలో కిషన్‌రెడ్డిని ఆహ్వానించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చెప్పా'' అని తెలిపారు. ''ఉత్తరాదికంటే కేంద్రానికి ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాం. జాతికి పెద్ద ఎత్తున సేవలందిస్తున్నాం. దక్షిణాది ప్రజలు భాజపా ఎదగడానికి అవకాశం కల్పించడంలేదన్న దుర్బుద్ధితో ఆ పార్టీ వారిపై డీలిమిటేషన్ పేరుతో కక్ష సాధించాలని నిర్ణయించుకొంది. దక్షిణాది అవకాశాలను పరిమితం చేసే ఆ చర్యలను మేం అంగీకరించం'' అని స్పష్టం చేశారు.

*** కేంద్ర కుట్రను తిప్పకొట్టడానికి చెన్నైలో కార్యాచరణ**

''భాజపా, కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాదిపై పన్నుతున్న కుట్రను తిప్పికొట్టడానికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చెన్నైలో ఈ నెల 22న నిర్వహిస్తున్న అఖిలపక్ష సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రిగా నన్ను ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకత్వం అనుమతితో హాజరై దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న నష్టాన్ని చర్చించి మేం కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేస్తాం. అంతకంటే ముందే తెలంగాణలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలనుకుంటున్నాం.

*** దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అందరూ రావాలి**

స్టాలిన్ నిర్వహిస్తున్న సమావేశానికి పార్టీలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అందరూ రావాలి. ఇది ఒక్కరోజు కోసం నిర్వహిస్తున్న సమావేశం కాదు. 2029 ఎన్నికల్లోపు జరగబోయే అన్ని పరిణామాలనూ ఎదుర్కోవడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఇందులో నిర్ణయిస్తాం. కేంద్ర ప్రభుత్వం, భాజపా చర్యలకు వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించడమే ఈ సమావేశం ముఖ్య ఎజెండా అన్నది నా ఉద్దేశం'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో మీరేమైనా కీలకపాత్ర పోషిస్తారా అన్న విలేకరుల ప్రశ్నకు బదులిస్తూ... ''ఇప్పటికే స్టాలిన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆయన చర్యలను ప్రోత్సహిస్తూ భవిష్యత్తు కార్యాచరణ చేపట్టడమే మా ప్రధాన ఉద్దేశం'' అని

# ప్రతి నియోజకవర్గంలో 10వేల ఇళ్లపై 'సౌర'భాలు

వంద యూనిట్లే వాడుకుంటే మిగతాదానికి యూనిట్‌కు రూ.2.09 చొప్పున ప్రభుత్వం ప్రతి నెలా డబ్బులు చెల్లిస్తుంది. ఉచిత విద్యుత్తుతో పాటు ఆదాయం కూడా వస్తుంది. ప్రజలు అర్థం చేసుకొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి. 2030 ఏళ్లు ఉచితంగా విద్యుత్తు వస్తుంది'' అని తెలిపారు.

*** బీసీలకు అదనంగా రూ.20వేల రాయితీ**

- బీసీలకు కేంద్రం ఇచ్చే రాయితీకి అదనంగా రూ.20వేల రాయితీ ఇస్తాం. రెండు కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.1.20 లక్షల వరకు ఖర్చవుతుండగా.. కేంద్రం రూ.60వేలు
- రాయితీగా అందిస్తుంది. బీసీలకు రాష్ట్రప్రభుత్వం తరఫున మరో రూ.20వేలు అదనంగా ఇస్తాం. బీసీలకు అండగా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం.
- ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్ల వరకు పూర్తి ఉచితంగా అందిస్తాం.
- ఇతరులకు ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు రూ.78వేలు రాయితీ ఇస్తాం. మిగిలినది ఇంటి యజమాని పెట్టుకోవాలి. దానికి ప్రభుత్వం నుంచి గానీ, బ్యాంకు నుంచి గానీ రుణం తీసుకోవచ్చు. ప్రభుత్వం నుంచి తీసుకుంటే తొమ్మిదేళ్లలో 9.5% వడ్డీతో తిరిగి చెల్లించాలి.

*** రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి**

- 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనం కోసం పాలసీ తీసుకొచ్చాం. రూ.10లక్షల కోట్ల పెట్టుబడితో 7.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేలా దీన్ని తీసుకొచ్చాం. ఇప్పటివరకు రూ.5.19లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పునరుత్పాదక ఇంధనం 47.2 గిగావాట్లు అందుబాటులోకి వస్తుంది. పనులు పూర్తయితే 3.70 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. సౌరవిద్యుత్తు ప్యానల్ తయారీ యూనిట్లు వస్తే మరో 3 లక్షల ఉద్యోగాలు వస్తాయి.
- కూటమి ప్రభుత్వం వచ్చాక సరఫరా నష్టాలను 10.35% నుంచి 9.27%కి తగ్గించాం. దీంతో రూ.1350 కోట్లు ఆదా అయ్యాయి. వచ్చే ఐదేళ్లలో ట్రాన్స్‌మిషన్‌లో రూ.16వేల కోట్లు ఖర్చుచేస్తాం. వర్సిటీల్లో హరిత విద్యుత్తుపై పరిశోధనలు చేయాలి.
- శ్వాపింగ్ విధానం తీసుకొస్తున్నాం. ఈ రోజు 600 మెగావాట్లు వేరే రాష్ట్రాల నుంచి వస్తోంది. ఇతర రాష్ట్రాలకు అవసరాలు ఉన్నప్పుడు మనం ఇస్తాం. మార్కెట్‌లో విద్యుత్తు కొనాలంటే యూనిట్ ధర రూ.5.80 ఉండగా.. మనకు సగటున రూ.4.80కే వస్తోంది.
- గతేడాది యూనిట్‌కు రూ.5.16 చొప్పున విద్యుత్తు కొన్నారు. ఏప్రిల్ నుంచి దీన్ని రూ.4.80కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టాను. వచ్చే ఐదేళ్లు ఛార్జీలు పెంచబోము.

*** విద్యుత్తు వాడకుండానే రూ.9వేల కోట్లు చెల్లించారు**

''201924 మధ్య చీకటి రోజులు కొనసాగాయి. అసమర్థ పాలన వల్ల ఏం జరుగుతుందో ఇదో కేస్ స్టడీ. సౌర విద్యుత్తును వాడకుండానే రూ.9వేల కోట్లు చెల్లించారు. కృష్ణపట్నం స్టేజ్ 2, వీటీపీఎస్ స్టేజ్ 5 రెండూ ఆలస్యం కావడంతో రూ.18,818 కోట్ల వ్యయం పెరిగిపోయింది. పోలవరం విద్యుత్తు ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో రూ.1,044 కోట్లు నష్టపోయాం. గత ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాలతో బకాయిలు రూ.1.12 లక్షల కోట్లకు పెరిగిపోయాయి. 9సార్లు టారిఫ్ పెంచి, పేదలపై రూ.32,166కోట్ల భారం వేశారు. నెలకు వంద యూనిట్లు వాడేవారికి యూనిట్ ధర రూ.2.44 ఉంటే దాన్ని రూ.4.53కి పెంచారు'' అని సీఎం తెలిపారు.

*** ప్రపంచబ్యాంకు జీతగాడన్నా భరించాను**

''రాష్ట్రం కోసం మంచి చేయాలనుకుంటే ఇదే అసెంబ్లీలో నన్ను ప్రపంచబ్యాంకు జీతగాడని మాట్లాడారు. సీఎంగా ఉన్నా నిందలు పడ్డాను. రాష్ట్రం కోసం తృప్తిగా నిందలు భరించాను. అప్పట్లో దేశంలోనే తొలిసారి విద్యుత్తులో సంస్కరణలు తీసుకొచ్చిన రాష్ట్రం ఏపీ. సరఫరా నష్టాలను 35% నుంచి 23%కి తగ్గించాం. 200304 నాటికి విద్యుత్తు కొరత లేని రాష్ట్రంగా రూపొందించాం. దీంతో రాష్ట్రానికి లాభాలు రాగా.. నాకు నష్టాలు వచ్చాయి. నేను తీసుకొచ్చిన సంస్కరణలను ప్రజలు అర్థం చేసుకోలేకపోవడంతో ఓడిపోయాం. ఉచిత కరెంట్.. విద్యుత్తు బిల్లులు మాఫీ చేయలేకపోయాం. మేము చేసిన సంస్కరణలను ఉపయోగించుకొని మాఫీ చేస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది'' అని పేర్కొన్నారు.

*** రైతులకు పీఎం కుసుమ్**

పీఎం కుసుమ్ కింద 3.85 లక్షల పంపుసెట్లకు సౌరవిద్యుత్తు పెట్టాలని అనుకుంటున్నాం. దీనికి కేంద్రం ఆమోదం తెలిపింది. రైతులు 7.5 హెచ్‌పీ మోటార్లకు సౌరవిద్యుత్తు పెట్టుకుంటే ఒక్క పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. అవసరాలకు వాడుకున్న తర్వాత మిగతా విద్యుత్తును గ్రిడ్‌కు ఇవ్వొచ్చు. కొంతమంది రైతులు ముందుకు రాకపోతే.. విద్యుత్తు ఉపకేంద్రాల వద్ద 1,327 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తాం.

# నకిలీ సిమ్ కార్డులపై అస్త్ర

*** 10 సెకన్లలో కోటి ముఖాలను వడబోసే సామర్థ్యం**

*** తొలి దశలో 87 కోట్ల మొబైల్ కనెక్షన్ల విశ్లేషణ**

*** సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరస్థుల ఆటకట్టు**

హైదరాబాద్: 'వంద పేర్లు.. 100 నకిలీ ధ్రువపత్రాలు.. 213 సిమ్‌కార్డులు' ఒకే వ్యక్తి సైబర్ మోసాల కోసం చేసిన నేరమిది. అతడి స్వరూపాన్ని 'అస్త్ర' సాంకేతిక పరిజ్ఞానం అవలీలగా కనిపెట్టింది. నకిలీ సిమ్‌కార్డులతో సైబర్ నేరాలకు తెగబడుతున్న మోసగాళ్ల పాలిట ఇది సరికొత్త అస్త్రంలా మారింది. కృత్రిమ మేధ ఆధారంగా మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్ పరిధిలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ రూపొందించిన ఈ సాంకేతికత నేరస్థుల ఆటకట్టిస్తోంది. 'ఏఐ అండ్ ఫేషియల్ రికగ్నిషన్ పవర్డ్ సొల్యూషన్ ఫర్ టెలికం సిమ్ సబ్‌స్క్రైబర్ వెరిఫికేషన్(అస్త్ర)' అని పిలిచే ఈ సాంకేతికత మోసగాళ్ల గుట్టు రట్టు చేస్తోంది. కోట్ల మంది వినియోగదారుల డేటాబేస్‌ను సమర్థంగా వడబోసి నకిలీలను పట్టేస్తోంది. ఇలా మనరాష్ట్రంలో నిరుడు 14,885 సిమ్‌కార్డులను బ్లాక్ చేసింది. సైబర్ నేరగాళ్లు నకిలీ ధ్రువపత్రాలతో సిమ్‌కార్డులను పొందుతూ బ్యాంకుల్లో ఖాతాలు తెరుస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ ఖాతాలను ప్రారంభిస్తున్నారు. వాయిస్‌కాల్స్ చేయడం, సంక్షిప్త సందేశాలు, మెయిల్స్ పంపడం ద్వారా ప్రజల ఓటీపీలాంటి కీలక సమాచారాన్ని తెలుసుకొని డబ్బు కొట్టేస్తున్నారు. అలా కాజేసిన సొమ్మును ఖాతాల్లోకి బదిలీ చేయించుకొని ఏటీఎంల నుంచి డ్రా చేసేస్తున్నారు.

*** మోసాల గొలుసును తెంపేందుకు...**

మోసగాళ్లు సిమ్‌కార్డులను తీసుకునేటప్పుడు నకిలీ ధ్రువపత్రాలను సమర్పించినా... ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి. ఈక్రమంలో వారు ఎన్ని సిమ్‌లు తీసుకున్నా 'అస్త్ర' వడబోతలో ఇట్టే తెలిసిపోతో)వెంటనే బ్లాక్ చేస్తున్నారు. దాని ఉపయోగించి నకిలీ ఖాతాలను తెరవకుండా అడ్డుకుని సైబర్ మోసాల గొలుసుకట్టును తెంపగలుగుతున్నారు. నకిలీల సమాచారాన్ని దర్యాప్తు సంస్థలకు చేరవేసి, వారిని పట్టుకునే ప్రయత్నమూ చేస్తున్నారు.

*** కనీసం 97.5% సరిపోలితేనే ఫలితం**

టెలికమ్యూనికేషన్ శాఖ దేశంలోని సిమ్ వినియోగదారులందరి డేటాను 2012 నుంచి చిత్రాలతో సహా టెలికం ఆపరేటర్ల నుంచి సేకరిస్తోంది. ఆ సమాచారంతో రూపొందించిన డేటాబేస్... అస్త్రకు కోర్ డేటాబేస్‌గా మారింది. ఎప్పటికప్పుడు దాన్ని అప్‌డేట్ చేస్తున్నారు.



2021 ఏప్రిల్‌జులై మధ్య కాలంలో హరియాణాలోని మేవాట్ రీజియన్‌లో అస్త్రను ప్రయోగాత్మకంగా పరిశీలించారు. అనుమానితుడి చిత్రాన్ని ఇస్తే 10 సెకన్లలోనే కోటి చిత్రాలతో సరిపోల్చింది.

రెండు చిత్రాల్లోని ముఖాల మధ్య సారూప్యత కనీసం 97.5% వరకు సరిపోలితేనే ఒకే వ్యక్తిగా అస్త్ర పరిగణిస్తుంది.

తొలిదశలో అస్త్ర సుమారు 87 కోట్ల మొబైల్ కనెక్షన్లను విశ్లేషించింది. వాటిల్లో 40 లక్షల మందికిపైగా వినియోగదారులు ఒకే చిత్రాన్ని వినియోగించి బహుళ కనెక్షన్లు పొందినట్లు తేల్చింది. పరిశీలన అనంతరం 36 లక్షల కనెక్షన్లను టెలికం ఆపరేటర్లు డిస్‌కనెక్ట్ చేశారు. వారి సమాచారాన్ని బ్యాంకులకు, పేమెంట్ వ్యాలెట్లకు, సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫాంలకూ పంపించారు.

**ఇది ఎలా పనిచేస్తుందంటే...**

డేటా కలెక్షన్: టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి 100% సిమ్‌కార్డు కొనుగోలుదారుల డేటాను సేకరిస్తోంది. సిమ్ రిజిస్ట్రేషన్ సమయంలో కొనుగోలుదారుడు సమర్పించిన చిత్రాన్ని సైతం సమీకరిస్తోంది.

ఇమేజ్ మ్యాచింగ్: కొనుగోలుదారుడి ముఖ కవళికల్ని తమ డేటాబేస్‌లోని ఇతర చిత్రాలతో సరిపోల్చడం ద్వారా అదే వ్యక్తి పేరిట ఇంకా ఏమైనా సిమ్ కనెక్షన్లు ఉన్నాయేమోనని తేల్చేస్తోంది.

ఫ్రాడ్ డిటెక్షన్: ఒకే వ్యక్తి పేరిట బహుళ కనెక్షన్లు ఉంటే గుర్తిస్తోంది. ఆయా కనెక్షన్లు అతడి వాస్తవ ధ్రువపత్రాలతోనే ఉన్నాయో లేదో సరిచూస్తోంది. ఒకవేళ లేకుంటే అనుమానితుల జాబితాలో చేర్చుతోంది.

యాక్షన్: అనుమానితుల జాబితాను సంబంధిత దర్యాప్తు సంస్థలకు, టెలికం ఆపరేటర్లకు పంపిస్తోంది. నేరస్థులను గుర్తించి సైబర్ నేరాలను ముందస్తుగానే నియంత్రిస్తోంది.

# భారత్ సమ్మిట్‌కు అనుమతులివ్వండి!

(మొదటిపేజీ తరువాయి)

జైశంకర్ సానుకూలంగా స్పందించారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వశాఖ మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు ముఖ్యమంత్రి విలేకర్లతో మాట్లాడుతూ... ''మేలో హైదరాబాద్‌లో జరిగే మిస్‌వరల్డ్ పోటీలకు 100కుపైగా దేశాల నుంచి పోటీదారులు, విదేశీ ప్రతినిధులు, 3,000 మందికిపైగా మీడియా ప్రతినిధులు హాజరుకాబోతున్నారు. ఈ పోటీకి సంబంధించిన కార్యక్రమాలు రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాల్లో జరుగుతాయి. ఇందుకనువెin చారిత్రక, పర్యాటక స్థలాలను ఎంపిక చేయడానికి త్వరలో అధికారులతో కమిటీ ఏర్పాటు చేయబోతున్నాం. ఇప్పటికే గుర్తింపు పొందిన స్థలాలను, కొత్త ప్రదేశాలను ఎంపికచేయడం పరంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై తగిన సిఫార్సులు చేస్తుంది''అని పేర్కొన్నారు.

# రేషన్‌కార్డులు ఇక బీపీఎల్, ఏపీఎల్

(మొదటిపేజీ తరువాయి)

దిగువన ఉన్నవారికి బీపీఎల్ కార్డులు.. ఎగువన ఉన్నవారికి ఏపీఎల్ కార్డులు ఇచ్చే ఆలోచన ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పుడు ట్రైకలర్‌లో బీపీఎల్ కార్డులను, గ్రీన్ కలర్‌లో ఏపీఎల్ కార్డులను పంపిణీ చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గురువారమిక్కడ అసెంబ్లీలో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''రాష్ట్రంలో 2.8 కోట్ల మంది రేషన్‌కార్డుల లబ్ధిదారులుగా ఇప్పటికే ఉన్నారు. అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇస్తుంది. కార్డుల తయారీ సంస్థ ఎంపిక కోసం టెండర్లు పిలిచాం. ఆ ప్రక్రియ నెలాఖరులోగా అయిపోతుంది. కొత్త రేషన్‌కార్డుల జారీ ఏప్రిల్‌లో ఉండొచ్చు. కొత్తవారితో పాటు ఇప్పటికే కార్డులున్న వారికి స్మార్ట్‌కార్డులు జారీచేస్తున్నాం. గతంలో పింక్‌కార్డులు ఉన్నవారికి గ్రీన్‌కార్డులు, తెల్లకార్డు ఉన్నవారికి ట్రైకలర్ కార్డులు వస్తాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం భారాస ప్రభుత్వం ఖర్చుచేసిన రూ.లక్ష కోట్లు రాష్ట్రానికి నష్టం వాటిల్లింది. మూడు బ్యారేజీల వాడకం విషయంలో గత ప్రభుత్వంలా వ్యవహరిస్తే 44 గ్రామాలు, భద్రాచలం పట్టణం కొట్టుకుపోతాయి'' అని మంత్రి పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చివరి 50 మీటర్లు ప్రమాదకరమని ఉత్తమ్ అన్నారు. అందుకే అక్కడ రోబోలను వాడుతున్నామని, దీనికి రాతపూర్వక అనుమతి ఇచ్చామని చెప్పారు. ప్రమాదం జరగకపోతే సొరంగం పనులు రెండేళ్లలో పూర్తయ్యేవన్నారు. తాను ఇప్పటికే ఏడుసార్లు గెలిచానని, మంత్రిగా ఉన్నానని, మరే ఆశలు లేవంటూ విలేకరులడిన ప్రశ్నకు ఉత్తమ్ బదులిచ్చారు. భాజపా ఎమ్మెల్యే రామారావు పటేల్ స్పందిస్తూ.. మీరు ముఖ్యమంత్రి కావాలిగా అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

# నేడు గ్రూప్3 ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

తేదీల్లో గ్రూప్1, గ్రూప్2 రాతపరీక్షల మార్కులను కమిషన్ వెల్లడించింది. 14న గ్రూప్3 జనరల్ ర్యాంకు జాబితా వెల్లడికానుంది. ఈ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 5.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా..నవంబరు 17, 18 తేదీల్లో రాతపరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 50.24శాతం మంది అభ్యర్థుల హాజరు నమోదైంది.

# ఇది వేర్పాటువాద మనస్తత్వాన్ని చాటుతోంది

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నాలు చేస్తోంది. ఇటువంటి సమయంలో.. సొంత కరెన్సీ చిహ్నాన్ని మనం బలహీనపరుస్తున్నామా?'' అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను నిలబెడతామని రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేస్తారని.. అయితే, '₹' వంటి జాతీయ చిహ్నాన్ని తొలగించడం ఆ ప్రమాణానికే విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఇది జాతీయ ఐక్యత పట్ల నిబద్ధతను దెబ్బతీస్తుందన్నారు. డీఎంకే చర్యలు.. దేశ ఐక్యతను బలహీనపరిచే వేర్పాటువాద భావాలను ప్రోత్సహించే ప్రమాదకరమైన మనస్తత్వాన్ని సూచిస్తోందని మండిపడ్డారు.

# మహిళా సారథ్యంలో భారత్ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

ఆఫ్ వుమెన్' 69వ సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళాభివృద్ధిపై మంత్రిత్వ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. భారత ప్రభుత్వం స్థాపించిన సార్వజనిక డిజిటల్ మౌలిక సదుపాయాలు.. లైంగిక వివక్షను నిర్మూలించి మహిళల్ని ఆర్థికాభివృద్ధిలో భాగస్వాముల్ని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ రంగంలో తమ అనుభవాలను ప్రపంచ దేశాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎనభై వసంతాలు పూర్తిచేసుకున్న ఐరాస సామర్థ్య పెంపుదలకు సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ కొత్త చర్యలను ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యయ నియంత్రణ తప్పనిసరి అని అన్నారు. సామర్థ్య పెంపుదలకు తీసుకోదగిన చర్యల కోసం అండర్ సెక్రటరీ జనరల్ గయ్ రైడర్ నేతృత్వంలో ఒక అంతర్గత కార్యదళాన్ని నియమించారు.

# ఫ్రీహోల్డ్ పేరిట పేదల భూముల్ని కొట్టేశారు

(మొదటిపేజీ తరువాయి)

అని హోంశాఖ మంత్రి అనిత ధ్వజమెత్తారు. శాసనసభలో గురువారం రెవెన్యూ పద్దులపై చర్చ అనంతరం మంత్రి సత్యప్రసాద్ తరఫున అనిత సమాధానమిచ్చారు. 'కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్రీహోల్డ్ భూములను రీవెరిఫికేషన్ చేయించాం. 13 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ చేయగా.. 5 లక్షల ఎకరాలకు సంబంధించి నిబంధనలు పాటించలేదు. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లలోనూ అవకతవకలే. 25 వేల ఎకరాల రిజిస్ట్రేషన్‌లలో 8 వేల ఎకరాలను చట్టవిరుద్ధంగా చేశారు. అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని ప్రైవేటు భూముల్ని కబ్జా చేశారు' అని వెల్లడించారు. 'ప్రభుత్వం మారాక బాధితులంతా బయటకొచ్చారు. రెవెన్యూ, పోలీస్‌శాఖలకు వచ్చే అర్జీల్లో 70% భూసంబంధమైనవే ఉంటున్నాయి. ఆక్రమణలను అణచివేసేందుకు కబ్జారాయుళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నాం' అని మంత్రి వివరించారు.

**తప్పులతడకగా రీసర్వే....**

'వైకాపా ప్రభుత్వం రీసర్వేనూ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటూ.. తప్పుల తడకగా మార్చింది. 6,688 గ్రామాల్లో రీసర్వే చేస్తే.. విస్తీర్ణం, సరిహద్దులు, వర్గీకరణ, పేర్లలో అన్నీ తప్పులే. వాటి పరిష్కారానికి గ్రామాల్లో కూటమి ప్రభుత్వం సభలు నిర్వహించింది. 2.79 లక్షల అర్జీలు రావడమే తప్పుల తడకగా సర్వే సాగిందని చెప్పేందుకు నిదర్శనం.. అందులో 98% పరిష్కరించాం. నెలాఖరులోగా 2% పరిష్కరిస్తాం. రెవెన్యూ సదస్సుల సందర్భంగా 1.85 లక్షల అర్జీలు రాగా.. 93% పరిష్కరించాం' అని తెలిపారు.

**రోజుకు 20 ఎకరాలే సర్వే**

'జనవరి 20న రాష్ట్రవ్యాప్తంగా 628 గ్రామాల్లో శాస్త్రీయంగా రీసర్వే ప్రారంభించాం. ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా తీసుకుని రీసర్వే ప్రారంభించాం. ఒక్కో బ్లాక్‌లో ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్ఓ, వీఆర్ఏను నియమించాం. వీరు 200 నుంచి 250 ఎకరాల్లో సర్వే చేస్తారు. బ్లాక్‌లోని రైతులతో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి, సమాచారం పంపిస్తాం. స్థానికంగా నివాసం ఉండని భూయజమానులు సర్వే సమయంలో తమ ప్రతినిధిని పంపవచ్చు. రోజుకు 20 ఎకరాలే సర్వే చేస్తాం' అని మంత్రి అనిత వివరించారు.

# లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

*** చౌటుప్పల్ లో 10ట్రాన్స్ ఫార్మర్లు ప్రారంభం**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్, మండల వ్యాప్తంగా లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని తాజా మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు , మునుగోడు ఎన్నికల సమన్వయకర్త శ్రీ పబ్బరాజు గౌడ్ లుఅన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు చౌటుప్పల్ మున్సిపాలిటీలోని మణికంఠ కాలనీ, లింగోజిగూడెం, అంకిరెడ్డిగూడెం, పంతంగి, ఆరెగూడెం, కుంట్లగూడెం, నేలపట్ల గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేసిన 100కేవీ, 10ట్రాన్స్ ఫార్మర్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి





మాట్లాడి నియోజకవర్గానికి ప్రత్యేక బడ్జెట్ తీసుకొచ్చి, ఎన్నో ఏళ్లుగా రైతులు ప్రజలు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యలను పరిష్కారం చేస్తున్నారన్నారు. మండలంలోని కాట్రేవ్, ధర్మోజిగూడెం, మసీదుగూడెం, ఎస్ లింగోటం, గుండ్లబావి గ్రామాలలో కూడా త్వరలోనే ట్రాన్స్ ఫార్మర్లు బిగించి, ప్రారంభిస్తామన్నారు. ముందస్తుగా వేసవి కాలం దృష్ట్యా రైతులు ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదని ఎమ్మెల్యే చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య గారు , మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలగ రాజశేఖర్ రెడ్డి గారు,మున్సిపాలిటీ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మా గౌడ్, విద్యుత్ శాఖ డీఈ మల్లికార్జున్, ఏడిఈ పద్మ, ఏఈ సతీష్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉబ్బు వెంకటయ్య, గుండు మల్లయ్య గౌడ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, రామలయ గుడిఛైర్మన్ మాజీ కౌన్సిలర్లు బాబా షరీఫ్, బొంగు జంగయ్య గౌడ్, బోడిగే బాలకృష్ణ గౌడ్, బండమీది మల్లేశం, బత్తుల విప్లవ కుమార్ గౌడ్, కేతరాజు అచ్చయ్య, రావుల స్వామి, మాజీ సర్పంచ్ లు జాల మల్లేష్, ఊదరి నర్సింహ్మా, ముద్ధం సుమిత్ర సత్తయ్య, నాయకులు పాక చిరంజీవి, దేప రాజు, జి మహేష్, కల్లెం దయాకర్ రెడ్డి, ఎర్రగోని లింగస్వామి, గ్రామశాఖ అధ్యక్షులు యాట శంకరయ్య, సామ వెంకట్ రెడ్డి, పాలమాకుల నరసింహ, గుండు లక్ష్మణ్, బోయ అంబేద్కర్, గోశిక నరసింహ, గోశిక రవి, చీరిక అంజిరెడ్డి, తూర్పింటి రవి, బోయ వెంకట్ , బద్దం నరేష్, కొంతం వెంకట్ రెడ్డి, సప్పిడి సంజీవరెడ్డి, గంగాపురం నగేష్, బండమీది వెంకటేశం, గుండు వెంకటేశం, చెరుకు లింగస్వామి గౌడ్, తొర్పునూరి రవి, కంచరకుంట్ల రాంరెడ్డి, ఎరుకల సాయి, చౌట లింగస్వామి, పాలమాకుల యాదయ్య, గుండు నరసింహ, బోయ యాదయ్య, బోయ ఆనంద్, బాతరాజు యాదయ్య, వెలగ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు ఘన సన్మానం

**- పల్లె శేఖర్ రెడ్డి..**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: శాసన మండలి సభ్యునిగా నూతనంగా ఎన్నికైన సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంను చౌటుప్పల్ మండల సిపిఐ కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా సిపిఐ పార్టీ నాయకులతో హైదరాబాద్ మగ్దూం భవన్ లో గురువారం కలిశారు. నూతన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకత్వానికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు పార్టీ నాయకత్వానికి ప్రత్యేకంగా జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నెల్లికంటి సత్యంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సిపిఐ పార్టీ మరింత బలపడే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకొని, పార్టీ సిద్ధాంతాల మేరకు కష్టపడి పనిచేసే వారికి న్యాయం జరుగుతుందని నెల్లికంటి సత్యంకు ఎమ్మెల్సీ ఇవ్వడంతో తేటతెల్లమైందన్నారు.

## జిల్లా కేంద్రాలలో స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**- పల్లె మధుకృష్ణ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం జిల్లా కేంద్రాలలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధు కృష్ణ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామంలో డివైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. పలువురు నుంచి సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా పల్లె మధు కృష్ణ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాల కోసం, నైపుణ్యం పెంపొందించుకునేందుకు వీలుగా జిల్లా కేంద్రాలలో స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, నిరుద్యోగ యువత కోసం రూ.4వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు గానే మారాయని ధ్వజమెత్తారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై 15నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అటకెక్కాయని ఆరోపించారు. గత రాష్ట్ర ప్రభుత్వం యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్య ధోరణిలోనే వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు పల్లె శివకుమార్, గ్రామ అధ్యక్షుడు పాలమకుల రాకేష్, కార్యదర్శి వనం విజయకుమార్, నాయకులు బొడిగె సైదులు, దొడ్డి లింగస్వామి, రుద్రగోని మధు, టి రాజు, రాగీరు నవీన్, మాధగోని లింగస్వామి, గంగాదేవి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వీ కే ఓ సి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట వీ కే ఓ సి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించి జి ఎం శాలేం రాజు కు మెమొరాండం అందజేశారు .బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జునరావు అధ్యక్షతన సమావేశం జరుగగా ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కొత్తగూడెం వీ కే ఓ సి లో బొగ్గు వెలికి తీసే పనిని ప్రైవేటువారికి అప్పగిస్తే కొత్తగూడెం ఏరియా పరిస్థితి ఏమైపోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. వీ కే ఓ సి ప్రైవేటీకరణ ప్రయత్నాలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కు సింగరేణి మనుగడ కార్మికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే




ప్రైవేటీకరణ ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సంస్థకు రావాల్సిన 35వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి నీ నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రైవేటీకరణ విషయంలో ప్రభుత్వం పునరాలోచించుకోవాలని కోరారు. లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏటువంటి పోరాటాలకు అయిన సిద్ధమని తేల్చిచెప్పారు. అన్ని కార్మిక సంఘాలు తమతో కలిసి వచ్చి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ మీద అనేక ఉద్యమాలు చేస్తున్న సంఘం ఏఐటీయూసీ అని రాష్ట్ర ప్రభుత్వం మరియు యాజమాన్యం ప్రైవేటీకరణ కు ముందుకు పోతే సహించేది లేదని ప్రైవేటు వాళ్ళతో బొగ్గు తీస్తే ఇక్కడి కార్మికులు ఎమైపోవాలని ఇప్పటికే కొత్తగూడెం లో బొగ్గుగనుల లేక వివిధ ఏరియా లకు డిపుటేషన్ ల మీద వెళ్లి పని చేస్తున్నారు అని వారి అందరి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ ను అడ్డుకోవడానికి తమ యూనియన్ సిద్ధంగా ఉన్నదని తెలిపారు ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్ , కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరాస్వామి, కార్పోరేట్ కార్యదర్శి రమణమూర్తి, ఆఫీస్ బేరర్ లు పిట్ సెక్రటరీ లు ,కార్మికులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్ కు వినతి

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వివేకానంద నగర్ డివిజన్ లోని పలు ప్రాంతాలలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు గురువారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ని తోటి కార్పొరేటర్లతో కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. ఏవైతే అత్యవసరంగా అవసరమో వాటికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు.

## నీది ఎద్దడిని నివారించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 17, 18వార్డులలో ఏర్పడ్డ నీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డికి కాలనీవాసులు గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం కాలనీలో వారం రోజులకు ఒకసారి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారని, నీరు సరిపోవటం లేదని పేర్కొన్నారు. టాంకర్ల సంఖ్య పెంచి మరింత నీటి సరఫరా చేయాలని కోరారు. అనంతరం మూడు రోజులకొకసారి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కాసోజు యాదయ్య చారి, పబ్బు రవీందర్ గౌడ్ , కొండే నర్సింహ్మ, మెట్టు రామచంద్రారెడ్డి, సామ జైపాల్ రెడ్డి, చీరిక దామోదర్ రెడ్డి, పబ్బు వినోద్ గౌడ్, సప్పిడి హరీష్ రెడ్డి, కరంటోతు సోను నాయక్, నర్సం శెట్టి రామకృష్ణ, సుభాష్, కొల్లి రామారావు, కృష్ణ, సప్పిడి వజ్రమ్మ, కురుమిద్దె నవ్య, వజ్రమ్మ, సభిత, జ్యోతి, సరిత తదితర కాలనీవాసులున్నారు.

## మార్చి 19 లోపు ఓటర్ జాబితా సవరణ అంశాల పై సమావేశాలు పూర్తి చేయాలి

**: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి .**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకు ఒకసారి పకడ్బందీగా అప్ డేట్ కావాలని, నూతనంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ఓటర్ జాబితా సవరణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాల పై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19






లోపు సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని ఆయన ఆదేశించారు.జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో, అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, ఏం.ఆర్.ఓ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నూతన ఓటర్ నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి ఓటర్ వివరాల తొలగింపు వివిధ అంశాలకు వాడే ఫారం 6,7,8 వివరాలను పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, ఎలక్షన్ సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వైష్ణవి టెక్నో స్కూల్ లో ఘనంగా హోలీ సంబురాలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో హోలీ సంబురాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరిపై ఒక్కరు రంగులు చల్లుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమానికి వైష్ణవి విద్య సంస్థల చైర్మన్ సి.హెచ్.నర్సింహులు గౌడ్ పాల్గొని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగల విశిష్టతను, వాటి ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వీకే7 ఓసి ప్రైవేటీకరణ కి వ్యతిరేకిస్తూ సింగరేణికే అప్పగించాలి

*** వాసిరెడ్డి సీతారామయ్య**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వీకే7 ఓసి ప్రైవేటీకరణ కి వ్యతిరేకిస్తూ సింగరేణికే అప్పగించాలని గేట్ మీటింగ్లో తెలియజేయడం జరిగినది.ఈ యొక్క మీటింగ్ కి అధ్యక్షత వహిస్తున్నటువంటి పిట్ సెక్రెటరీ హుమాయిన్ అలాగే ముఖ్య అతిథులుగా హాజరైనటువంటి వాసిరెడ్డి సీతారామయ్య.తదుపరి ఈనెల 7,8 తేదీలలో సీఎండీ స్థాయి లో జరిగిన మీటింగ్ నందు ఉద్యోగుల సంక్షేమం లో భాగంగా సొంత ఇంటి పథకం, వడ్డీ లేని ఋణం, కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు, ప్లే డే లలో ఎన్1 ఎత్తి వేయాలని, ప్రస్తుతం వున్నా జనరల్ మజ్దూర్, బదిలీ వర్కర్ హోదా పేర్లను మర్చి జనరల్ అసిస్టెంట్ గా చేయాలనీ, ఇంకమ్ టాక్స్,సోంత ఇంటి.




పథకం, తదితర అంశాలపై మీటింగ్లో పూర్తి స్థాయి లో మాట్లాడడం జరిగిందని.మీటింగ్ అనంతరం కొత్తగా చేరిన ఉద్యోగస్తులు 44 మంది ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ సెక్రెటరీ సాబీర్ పాషా బ్రాండ్ సెక్రెటరీ



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా గురువారం ఆమె నివాసంలో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు డివిజన్ మహిళా నాయకురాలతో కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

శేరిలింగంపల్లి , (ప్రజాస్ఫూర్తి ) :

## ఈసీఐఎల్ సిఎండిని కలిసిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు.



కాప్రా, (ప్రజాస్ఫూర్తి) : ఈసీఐఎల్ గ్రౌండ్ లో వాకింగ్ కోసం అవకాశం కల్పించాలని కోరుతూ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి లు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఈసీఐఎల్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద సిఎండి అనురాగ్ కుమార్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసీఐఎల్ గ్రౌండ్ లో వాకింగ్ కోసం అవకాశం కల్పించాలని కోరుతూ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి జరిగింది.ఈసీఐఎల్ ప్రాంగణంలో నడకకు ఈసీఐఎల్ కంపెనీ యాజమాన్యం అనుమతి నిరాకరించడంతో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కాంటేకర్ రవీందర్,పోతగాని రాజు గౌడ్, అంజి, వెంకట్ , వెంకట్ రెడ్డి, సంజయ్, మోహన్ రెడ్డి, సారంగ,నాయకులు మర్రి మోహన్ రెడ్డి నేమూరి మహేష్ గౌడ్, కనుకుల రజినీకాంత్ రెడ్డి, శ్రీశైలం, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పంచశీల స్కూల్ లో హోలీ వేడుకలు




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసా పేట లోని పంచశీల స్కూల్ లో గురువారం హోలీ పండుగ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరిపై నొక్కరు రంగులు చల్లుకుని హోలీ వేడుకలను పండుగ ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ నుంచి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ నుంచి భారాస ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. స్పీకర్ పట్ల వ్యాఖ్యలు చేసిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని మంత్రి సీతక్క శాసనసభలో ప్రతిపాదించారు. శాసన వ్యవస్థను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల విషయాన్ని ఎథిక్స్ కమిటీకి పంపాలని సూచించారు. బడ్జెట్ సెషన్స్ ముగిసే వరకు జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయాలని సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా.. స్పీకర్ ఆమోదించారు. జగదీశ్‌రెడ్డి వెంటనే సభ నుంచి వెళ్లి పోవాలని స్పీకర్ ఆదేశించారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌పై భారాస సభ్యులు నిర సనకు దిగారు. తమకు మాట్లాడే అవ కాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఛాంబర్‌లో కూర్చొన్న జగదీశ్‌రెడ్డి వద్దకు చీఫ్ మార్షల్ వచ్చి అసెంబ్లీ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. సభ నుంచి మాత్రమే సస్పెండ్ చేశారని, ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో కూర్చుంటే అభ్యంతరమేంటని భారాస ఎమ్మెల్యేలు ప్రశ్నించారు.

# నేరాల నియంత్రణలో.. సీసీ కెమెరాలు కీలకం

*** ఏసిపి మధుసూదన్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకమని చౌటుప్పల్ ఏసిపి పి. మధుసూదన్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం దేవనమ్మ నాగారంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నోషి ల్యాబ్ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మధుసూదన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. గ్రామాలలోని ప్రధాన కూడలి, దేవాలయాలు, బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను నియంత్రించవచ్చన్నారు. సీసీ కెమెరాల నిఘాతో అన్ని విధాలుగా భద్రత లభిస్తుందన్నారు. ఒక్క సిసి కెమెరా 100మందితో సమానమన్నారు. గ్రామాలలో దొంగతనాల నివారణకు, నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మన్మధ కుమార్, నోషి ల్యాబ్ మెయింటెనెన్స్ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు దాచేపల్లి మనోహర్ గుప్త, బొమ్మ రాములు, దోనూరి వెంకటరాంరెడ్డి, బొమ్మ మల్లేష్, రాసాల జంగయ్య, కారోబార్ చింతకింది రమేష్, అర్చకులు భోగ మాధవులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి సర్కార్ శికండి రాజకీయాలకు పాల్పడుతున్నారు

*** బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ విభాగం సీనియర్ నాయకులు నపారి చంద్రశేఖర్**

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : రేవంత్ రెడ్డి సర్కార్ దళిత స్పీకర్ అనే పదాన్ని అడ్డుపెట్టుకుని శికండి రాజకీయాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ విభాగం సీనియర్ నాయకులు నపారి చంద్రశేఖర్ మండిపడ్డారు. ఎస్సీ రిజర్వుడ్ స్థానం నుండి ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్ గా ఎన్నికైనన్నంత మాత్రాన వారు దళిత స్పీకర్ అని కాంగ్రెస్ పార్టీ మంత్రులు, శాసనసభ్యులు ఎలా సంభోదిస్తారని అన్నారు. గతంలో చాలా మంది స్పీకర్లుగా పనిచేసారని వారందరిని కులాల పేరుతో సంబోధించారా అని ప్రశ్నించారు. శాసన సభలో జరిగిన చర్చలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపుతూ రైతు ఋణ మాఫీ, రైతు భరోసా, సన్నా బియ్యం పంటకు రూ. 500 బోనస్ గురించి మాట్లాడితే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని వారిని సస్పెండ్ చేయడం సరికాదన్నారు.ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ నుండి తన ఆదేశాలను అమలు చేయాలని శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు పై ఒత్తిడి తెచ్చినట్లు క్లియర్ గా అర్థమవుతోందన్నారు. 125 ఫీట్ల బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సామాన్య ప్రజలు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపు మేరకు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసే కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దళిత బంధు లబ్ధి దారుల కుటుంబాలు, ఇతర దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నపారి కోరారు.



# తెలంగాణలో... ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం

**హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు 5 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటిం చారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, భారాస నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధి కారి ప్రకటించారు.**



# గాంధీ ఆసుపత్రి లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన రోగులు, సహాయకులు.. అరగంట సేపు ఉత్కంఠ

హైదరాబాద్: సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో గురువారం మధ్యాహ్నం సాంకేతిక లోపం కారణంగా లిఫ్ట్ మధ్యలోనే ఆగిపోయింది. అందులో ఉన్న రోగులు, సహాయకులు అరగంట పాటు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. టెక్నీషియన్ వచ్చి మరమ్మతులు చేయడంతో లిఫ్ట్‌లో చిక్కుకున్న 15 మంది సురక్షితంగా బయటపడ్డారు. గాంధీ ఆసుపత్రి ప్రధాన




భవనంలోని నాలుగవ నెంబరు లిఫ్ట్ సాంకేతిక లోపంతో ఆరవ అంతస్తు వద్ద మధ్యలోనే ఆగిపోయింది. దాదాపు అరగంట సేపు తీవ్ర ఆందోళనకు గురయ్యామని బాధితులు తెలిపారు. గాంధీ ఆసుపత్రిలో లిఫ్ట్‌ల పరిస్థితి అధ్వా నంగా తయారైందని రోగుల సహాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రి పదవి ఎప్పుడు వస్తుందనేది చెప్పలేను

**: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి**

హైదరాబాద్: 'నాకు మంత్రి పదవి ఇస్తే పార్టీకి, ప్రజలకు లాభం. కానీ, మంత్రి పదవి ఎప్పుడు వస్తుందనేది చెప్పలేను' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివిధ అంశాలపై స్పందించారు. "భువనగిరి ఎంపీ స్థానం కోసం నిద్రాహారాలు మాని గెలిపించా. స్పీకర్ కుర్చీని ఎవరూ ప్రశ్నించలేరు. జగదీశ్‌రెడ్డి స్పీకర్ ఛైర్‌ను ప్రశ్నించడం సరికాదు. అసెంబ్లీలో అతిగా ప్రవర్తించారు, స్పీకర్‌ను అవమా నించినందుకే ఆయనపై చర్యలు తీసుకున్నారు. మేము ఎవరినీ లక్ష్యంగా చేసుకోం..తప్పు చేస్తే వదిలిపెట్టం" అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

# ఆప్‌కు మరో షాక్.. సిసోదియా, జైన్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి అనుమతి!

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆ పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలపై కేసుల నమోదుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అనుమతి ఇచ్చినట్లు సమాచారం. దిల్లీలోని పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణంలో రూ.1300 కోట్ల మేర కుంభకోణం జరిగిందనే ఆరోపణలపై మనీష్ సిసోదియా, సత్యేందర్ జైన్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి




అనుమతి ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ 2400 తరగతి గదుల నిర్మాణంలో స్పష్టమైన అవకతవకలు ఉన్నట్లు కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ) 2020 ఫిబ్రవరి 17న ఓ నివేదికలో పేర్కొంది. ఈ క్రమంలోనే 2022లో దిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ ఈ కుంభకోణం ఆరోపణలపై దర్యాప్తునకు సిఫారసు చేస్తూ ప్రధాన కార్యదర్శికి నివేదికను సమర్పించింది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ హయాంలో మంత్రులుగా ఉన్న వీరిద్దరిపైనా ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు సమాచారం. గతంలో మద్యం విధానం కేసులో సిసోదియా, మనీలాండరింగ్ కేసులో సత్యేందర్ జైన్ అరెస్టయ్యి ఆ తర్వాత బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే.




## ఫ్యాకల్టీతో మార్నింగ్ వాక్.. విద్యార్థుల ఆత్మహత్యల కట్టడికి ఐఐటీ -గువాహటి ప్లాన్

పరీక్షల వల్ల కలిగే ఒత్తిడి, మార్కులు సాధించాలంటూ తల్లిదండ్రులు పదే పదే చెప్పడం, ఇతరులతో పోల్చడం, పరీక్షల్లో ఫెయిల్ అవుతామనే భయం.. ఇలా ఎన్నో కారణాలతో చాలా మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు కొంతకాలంగా చూస్తూనే ఉన్నాం. ఆత్మహత్యలను నివారించేందుకు ఐఐటీ గువాహటి ప్రణాళికలు చేస్తోంది. క్యాంపస్‌కు వచ్చే ఫ్రెషర్లకు మెడికల్ చెకప్ సహా ఫ్యాకల్టీతో మార్నింగ్ వాక్, కౌన్సెలింగ్ నిర్వహించాలని యోచిస్తోంది. గతంలో జరిగిన సెమిస్టర్ల సమయంలో కొందరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఇనిస్టిట్యూట్ కి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యం ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. ''విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడం, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలనేదే మా ఉద్దేశం. అందుకోసం ఇనిస్టిట్యూట్ సమగ్ర ప్రణాళిక చేస్తోంది'' అని డైరెక్టర్ దేవేంద్ర జలీహాల్ పేర్కొన్నారు. ''సెంటర్ ఫర్ హోలిస్టిక్ వెల్‌బీయింగ్ ద్వారా మానసిక ఆరోగ్యం కోసం కౌన్సిలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఆర్మీ విశ్రాంత సిబ్బందిని ఇందులో భాగం చేస్తున్నాం. వీరితో విద్యార్థులు బెరుకు లేకుండా అన్ని విషయాలు పంచుకునే వీలు ఉంటుంది. వారి గోప్యతకు భంగం కలగకుండా ఈ సిబ్బంది నడుచుకుంటారు. కొత్తగా ఇనిస్టిట్యూట్‌కు వచ్చిన ఫ్రెషర్లు ఫ్యాకల్టీతో కలిసి మార్నింగ్ వాక్‌లో పాల్గొనేలా ప్రోత్సహిస్తాం'' అని తెలిపారు.

## 17 మంది మావోయిస్టుల లొంగుబాటు..
# 9మంది తలలపై ₹24లక్షల రివార్డు

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 17మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9మంది తలలపై రూ.24లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు దినేష్ మొడియం (36), అతడి భార్య జ్యోతి తాటి అలియాస్ కళా మొడియం (32) ఉన్నట్లు తెలిపారు. దినేష్ తలపై రూ.8లక్షలు, జ్యోతిపై రూ.5లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. అలాగే, ఏరియా కమిటీ సభ్యులు దుడ్డ కరంపై రూ.5లక్షలు, మరో ఆరుగురి తలలపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందన్నారు. వీరందరూ గంగలూరు ఏరియా కమిటీలో వివిధ హోదాల్లో చురుగ్గా ఉన్నవారేనన్నారు. వీరి లొంగుబాటు వెనుక డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్,



కోబ్రా దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఎస్పీ వివరించారు. సైద్ధాంతిక లోపాలు, అమాయక గిరిజనుల పట్ల కొందరు సీనియర్లు దోపిడీకి పాల్పడటం వంటి చర్యలతో కలత చెందడం, భద్రతా బలగాల ప్రభావం పెరిగిన నేపథ్యంలో వీరంతా లొంగిపోయినట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ తెలిపారు. అలాగే, గ్రామాల్లో అభివృద్ధి కోసం తాము చేపట్టిన నియా నెల్లనార్' (యువర్ గుడ్ విలేజ్) అనే పథకం పట్ల ఆకర్షితులయ్యారన్నారు. లొంగిపోయిన వారికి రూ. 25వేలు చొప్పున సహాయం అందించామని.. ప్రధాన స్రవంతిలోకి చేర్చేందుకు ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది బస్తర్‌లో 792మంది మావోయిస్టులు లొంగిపోగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో 65మంది లొంగిపోయారు.

## ప్రమాదంలో 85లక్షల మంది విద్యార్థుల భవిత : పేపర్ లీకేజీలపై రాహుల్ గాంధీ


ప్రశ్నాపత్రాల లీక్‌లపై కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతి పక్షనేత రాహుల్ గాంధీ మరోసారి స్పందించారు. ఈ లీక్‌ల కారణంగా కష్టపడి చదివే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీనిపై పోరా డేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభు త్వాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రశ్నాపత్రాల లీకులతో 6 రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి కారణంగా కష్టపడి చదివే పిల్లలతో పాటు వారి కుటుంబాలు ఒత్తిడికి గుర వుతున్నాయి. వారి కష్టానికి తగిన ఫలితం అందడం లేదు. దీని వల్ల కష్టపడి పనిచేయడం కంటే నిజాయితీగా లేక పోవడమే మంచిదనే తప్పుడు సందేశం భవిష్యత్తు తరాలకు వెళ్తుంది. అది ఆమోదయోగ్యం కాదు. నీట్ పేపర్ లీక్ దేశాన్ని కుదిపేసి ఏడాది కూడా కాలేదు. దీనిపై మేము పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తంచేశాం. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం లీకులను అడ్డుకోలేకపోయింది.ఇది వారి వైఫల్యానికి నిదర్శనం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు



విభేదాలు పక్కన బెట్టి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటిని అరికట్టగలం. ఈ పరీక్షలు మన పిల్లల హక్కు. దాన్ని ఎలాగైనా రక్షించాలి' అని రాహుల్ రాసుకొచ్చారు. పేపర్‌లీక్‌లపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ పోస్టు చేశారు.

## నిజంగా అంత బాధ ఉంటే..
# నిర్మలమ్మ వ్యాఖ్యలకు విజయ్ కౌంటర్

చెన్నై: ప్రముఖ సంఘసంస్కర్త పెరియార్‌పై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన విమర్శలను తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ తీవ్రంగా ఖండించారు. ఏళ్లు గడిచినా ఆయన పేరు వాడకుండా ఉండలేని విధంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని కౌంటర్ ఇచ్చారు. తమిళాన్ని అవమానించిన వ్యక్తికి పూలమాలలు వేస్తున్నారంటూ ఈవీకే పెరియార్‌ను పరోక్షంగా ప్రసావిస్తూ రాజ్యసభలో సీతారామన్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన విజయ్.. సమాజంలో సాంఘిక దురాచారాలు పారదోలడానికి పెరియార్ చేసిన కృషిని కొనియాడారు. ''బాల్య వివాహాలను వ్యతిరేకించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. కులం పేరిట జరిగిన అకృత్యాలను ఖండించారు. ఇలా మనం ఆయన గురించి చెప్తూపోవచ్చు. సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని మనం ఇప్పుడు మాట్లాడుతున్న మాటలను ఆయన వందసంవత్సరాల క్రితమే పిలుపునిచ్చి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పెరియార్ తమిళ భాషను అవమానించినందుకు



కేంద్రమంత్రి నిజంగానే బాధపడ్డారా..? మీరు నిజంగా బాధపడి ఉంటే.. త్రిభాషా సూత్రాన్ని మాపై రుద్దడం ఆపేస్తారా..? పెరియార్ గురించి ఎవరైనా అవమానకర వ్యాఖ్యలు చేస్తే.. అవి వివాదాస్పదం అవుతుంటాయి. తమిళనాడు ప్రజల మనసులో ఆయన ఎలా నిలిచి ఉన్నారో, ఆయన్ను ఎలా గౌరవిస్తున్నారో ఈ ఒక్క ఉదాహరణ చాలు'' అని విజయ్ అన్నారు. జాతీయ విద్యా విధానంలోని (ఎన్‌ఈపీ 2020) త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు. విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా విధానాల అమలు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఎన్‌ఈపీ 2020లోని కీలక అంశాలను, ముఖ్యంగా త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద అందించాల్సిన రూ.573 కోట్లను నిలిపేసింది. ఎన్‌ఈపీ మార్గదర్శకాలు అమలు పరిస్తేనే కేంద్రం తన వాటా నిధులు అందిస్తుందని విధాన నిబంధనలు చెబుతున్నాయి. ఇలా కేంద్రం, తమిళనాడు మధ్య వివాదం నడుస్తోన్న వేళ.. నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారితీశాయి.

## తమిళనాడు బడ్జెట్ నుంచి రూపాయి సింబల్ మాయం
### : మరో వివాదం

జాతీయ విద్యావిధానంపై తమిళనాడు, కేంద్రం మధ్య జరుగుతున్న వివాదం మరో మలుపు తిరిగింది. తాజాగా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూపాయి సింబల్‌ను తొలగించారు. ఆ స్థానంలో తమిళనాడులో రూ అనే అర్థం వచ్చే అక్షరాన్ని చేర్చారు. దీంతో భాషల వివాదం మరింత ముదిరినట్లైంది. తమిళ



సంఘాలు ఈ నిర్ణయాన్ని స్వాగతించాయి. మాతృభాషను కాపాడుకొనేందుకు తీసుకొన్న చర్యగా అభివర్ణించాయి. కాగా మరికొందరు మాత్రం జాతీయ చిహ్నాన్ని తక్కువ చేసి చూపించారని మండిపడ్డారు. ముఖ్యంగా తమిళనాడులో హిందీ భాషను సబ్జెక్టుగా చేర్చడాన్ని డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే సీఎం స్టాలిన్ దీనిపై స్పందించారు. ''తమిళనాడు విద్యార్థులు మూడో భాషను నేర్చుకునేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారంటూ కొందరు మమ్మల్ని అడుగుతున్నారు. కానీ, ఉత్తరాదిలో మూడో భాష కింద ఏ భాషను నేర్పుతున్నారో చెప్పడం లేదు. అక్కడ రెండు భాషలను మాత్రమే బోధిస్తున్నట్లయితే ఇక్కడ మాత్రం మూడు భాషలను నేర్చుకోవాల్సిన అవసరం ఏముంది?'' అని ప్రశ్నించారు. విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని ఎన్‌ఈపీ 2020 సిఫార్సు చేస్తోంది. ఇందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి. ఈ ఫార్ములా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటికీ వర్తిస్తుంది. అయితే విద్యార్థులకు నేర్పాల్సిన భాషలేమిటన్నది నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలదే. జాతీయ విద్యావిధానంలోని కీలక అంశాలను, త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద అందించాల్సిన రూ.573 కోట్లను నిలిపేసింది. ఎన్‌ఈపీ మార్గదర్శకాలు అమలు పరిస్తేనే కేంద్రం తన వాటా నిధులు అందిస్తుందని విధాన నిబంధనలు చెబుతున్నాయి.

# పెడితే స్టార్ అయిపోవల్సిందే!






**ఈవెంట్ ఏదైనా స్టార్‌లా వెలిగిపోవాలని కోరుకోని అమ్మాయి ఉండదు. నగలూ దుస్తులనూ అందుకు తగ్గట్టే ఎంపిక చేసుకుంటారు కూడా. ముఖ్యంగా ఆభరణాలు జిగేల్మంటూ ఆకర్షణీయంగా కనిపించేందుకు రకరకాల రాళ్లు పొదిగినవి ధరిస్తుంటారు. 'స్టార్ సఫైర్' ఈ రాళ్లలో అత్యంత భిన్నమైనది. కాంతి పడగానే మెరుస్తూ**

ప్రకృతి ఎన్నో వింతల సమాహారం. అందులో అందమైనవీ ఆశ్చర్యాన్ని కలిగించేవీ మరెన్నో. మనం ధరించే ఖరీదైన వజ్రాలు, రత్నాలూ, మణిమాణిక్యాలూ కూడా అందులోనివే. భూమి పొరల్లో ఒక్కో రాయీ ఒక్కో రంగులో ఒక్కో ప్రత్యేక లక్షణాలతో ఏర్పడుతుంటుంది. అందులో ఉండే రకరకాల ఖనిజ మిశ్రమాలు వాటికా ప్రత్యేకతను తెచ్చిపెడతాయి. వాటి తళుకుబెళుకులే మనల్ని నగల్లో అమర్చుకుని ఆనందించేలా చేస్తాయి. 'స్టార్ సఫైర్' కూడా అలా తనకంటూ ఒక ప్రత్యేకతను కలిగిన రత్నమే. ఇందులోనే మరో రకం 'స్టార్ రూబీ'. ఈ స్టార్ స్టోన్‌లలో టైటానియం డై ఆక్సైడ్ సమ్మేళనమైన రూటిల్ అనే ఖనిజం సూదిలా రాయిలో రకరకాల దిశల్లో వ్యాపించి ఉంటుంది. అదే కాంతి పడినప్పుడు కనిపించే ఈ నక్షత్రాకృతికి కారణం అన్నమాట! ఇక, ఇలా కనిపించడాన్నే ఆస్టెరిజం అని పిలుస్తారు. పూర్వపు గ్రీకు భాషలో నక్షత్రం అన్న పదం నుంచీ ఈ ఆస్టెరిజం పుట్టిందట.

## నగల్లో...

స్టార్ సఫైర్‌గా పిలిచే ఈ రాళ్లలో ప్రధానమైనది నీలి రంగు. నిజానికి నీలమణిని సఫైర్ అని అంటాం. కానీ, ఇందులో గులాబీ, నారింజ, ఆకుపచ్చ, ఊదా, పసుపు పచ్చ... ఇలా విభిన్న రంగులవీ ఉంటాయి. ప్లాటినం, బంగారంలాంటి నగల్లో ఈ రాళ్లను ఎక్కువగా వాడుతున్నారు. ఉంగరాలు, పెండెంట్లు, చెవి దుద్దులు, బ్రేస్‌లెట్లు... ఇలా రకరకాల ఆభరణాల తయారీలో ఈ నక్షత్రపు రాయిని పొదుగుతున్నారు. వీటి మీద వెలుగు పడ్డ కోణాన్ని బట్టి నక్షత్రం ఒక్కోసారి ఒక్కోచోట కనిపిస్తుంది. అంతేకాదు సిక్స్ రే స్టార్, నైన్ రే స్టార్, ట్వెల్వ్ రే స్టార్... ఇలా నక్షత్రం ఎలా ఏర్పడుతుందన్నదాన్ని బట్టీ రాళ్లను పిలుస్తుంటారు.ఉదాహరణకు సిక్స్ రే స్టార్ అంటే, ఆ రాయిలోని నక్షత్రం ఆరు రేఖలతో కనిపిస్తుందన్నమాట. నక్షత్రం ఎంత బాగా ఏర్పడితే అంత గొప్ప అన్నది ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు కదూ! ఇంతకీ ఈ రాళ్లు మన దేశంలోని కశ్మీర్ దగ్గర అధిక మొత్తంలో దొరుకుతాయట. తర్వాతి స్థానంలో శ్రీలంక, బర్మాలు ఉన్నాయి. 'ద స్టార్ ఆఫ్ ఇండియా'గా పిలిచే ఒక రాయి అయితే ఏకంగా 560 క్యారెట్ల పైనే ఉందట. కాకపోతే న్యూయార్క్ మ్యూజియంలో ఉందనుకోండి. ఏదైతేనేం, రత్నగర్భ భారత్‌లో పుట్టిన మరో అద్భుతమైన రత్నం ఈ 'స్టార్ సఫైర్'... మీకూ నచ్చిందా!









# జిప్... సెట్.. శారీ!

**జీన్సుకి జిప్ వేయడం తెలుసు. కానీ చీరకు జిప్ వేయడం గురించి విన్నారా? ఏదైనా చిటికెలో అయిపోవాలి అనుకునే ఈ తరం అమ్మాయిలు తాము ప్యాంటు షర్టు వేసుకునేంత సమయంలోనే చీరలో సిద్ధమైపోవాలి అని కోరుకుంటున్నారు. ఇలా అనుకుంటే అలా జరిగిపోయే స్మార్ట్ యుగం కాబట్టి చీర కూడా జిప్ సెట్ గో... అన్నట్టు తయారైపోయింది. అదేనండీ... ఇప్పుడు ఫుల్ ట్రెండింగ్‌లో ఉన్న 'జిప్ అండ్ గో శారీ'ల గురించే మనం మాట్లాడుకుంటున్నది!**

కొత్త తరానికి పాత మీద మోజేం పోలేదు. జీన్సులూ స్కర్టులూ వేసుకుంటు న్నారు కాబట్టి చీరను మర్చిపోయారని అస్సలు అనుకోలేం. ఏ సందర్భానికి తగ్గట్టు ఆ డ్రెస్‌లో రెడీ అయిపోవడం అంటేనే వీళ్లకి ఇష్టం. అందుకే పెండ్లిళ్లు, గుళ్లూగోపురాలకు వెళ్లినప్పుడు అచ్చ తెనుగు చీరకట్టులో మెరిసిపోతుంటారు. ట్రెడిషనల్ డేలంటూ ఆఫీసుకూ కోక చుట్టి కేక పెట్టిస్తుంటారు. ఏతావాతా దీన్నిబట్టి అర్థం అయ్యేదేంటంటే, వాళ్లకి చీరమీద హేట్ ఫీలింగ్ ఏం లేదు. లవ్వున్నా తరచూ చూపించలేకపోతున్నారు. దానికి కారణం అయిదున్నర మీటర్లుండే ఆ వస్త్రాన్ని అందంగా కట్టుకోవడం రాక పోవడమే! పాపం వీళ్ల ఇబ్బందిని గమనించిన డిజైనర్లు ఇప్పుడు జీన్సుకు పోటీగా చీరను తయారుచేశారు. అర నిమిషంలో రెడీ అయిపోయే ఈ చీరలు 'జిప్ అండ్ గో శారీస్' పేరిట ట్రెండ్ అవుతున్నాయి.

**చిటికెలో...**

పేరుకు తగ్గట్టే 'జిప్ అండ్ గో శారీ' అంటే జస్ట్ జిప్ పెడితే సిద్ధమైపోయే చీరే. మడత విప్పి చూస్తే ఇది గౌనులా కనిపిస్తుంది. అంటే, పైన ఉన్న బ్లౌజ్, కింద చీర కలిపి కుట్టేసి ఉంటాయన్న మాట. కుచ్చిళ్లు కూడా రెడీగానే ఉంటాయి. ఈ గౌనును తొడుక్కుని ఛాతీ దగ్గర ఇచ్చిన జిప్ పెట్టుకోవాలి. తర్వాత నడుం దగ్గర ఉన్న బటన్‌ని కూడా పెట్టేస్తే కుచ్చులు ఎదురుగా వచ్చేస్తాయి. ఇక వాటికి అనుబంధంగా ఉండే కొంగును తిప్పి భుజం మీదుగా వేసుకుంటే చీరకట్టు సిద్ధమైనట్టే. సిల్క్, కాటన్, జార్జెట్, షిమ్మర్... ఇలా సాధా రణ చీరల్లో ఎన్నుకున్నట్టే వీటిలోనూ నచ్చిన రకాన్ని ఎంచుకోవచ్చు. చేతులు ఉన్నవే కాదు స్లీవ్‌లెస్ తరహాలోనూ ఈ చీరలు వస్తున్నాయి. జరీ అంచు చీరలూ, ఎంబ్రాయిడరీ బ్లౌజులతోనూ ఇవి తయారవుతున్నాయి. ఇంతకుముందు వచ్చే రెడీ టు వేర్ చీరల్లో నడుం దగ్గర హుక్ పెట్టి చీరను చుట్టి, జాకెట్ విడిగా వేసుకోవాలి. దానికి భిన్నంగా చీరా జాకెట్ రెండూ కలిపి ఉండి, జిప్ పెడితే సిద్ధమైపోవడం ఈ రకం ప్రత్యేకత. అదన్న మాట సంగతి. మరి చీరకు జిప్ వేసే ప్రయత్నం మీరూ చేస్తున్నారా?! చిటికేసి చెప్పండి!




# మనకొద్దీ మోనోడైట్

బరువు తగ్గాలనుకునేవాళ్లు రకరకాల డైట్ ప్లాన్‌లు ఫాలో అవుతుంటారు. పక్షం రోజులు పని గట్టుకొని కడుపు మాడ్చుకుంటారు. లాభం లేదనుకొని మళ్లీ వెనక్కి తగ్గుతారు. కానీ, వెయిట్ లాస్ కోసం తహతహలాడుతున్న వారికోసం ఇప్పుడు నయా ట్రెండ్ ఒకటి పరిచయమైంది. అదే మోనో డైట్. ఈ విధానంలో రోజంతా గానీ, ఒక భోజనంలో గానీ ఒకే రకమైన ఆహారం తీసుకోవడమే మోనో డైట్ సూత్రం. ఉదాహరణకు ఒక రోజు కేవలం అరటిపళ్లు మాత్రమే ఆరగించాలి. ఇంకోరోజు కేవలం గుడ్డు వెరైటీలపై ఆధారపడాలి. ఇలా చేయడం వల్ల సులువుగా బరువు తగ్గొచ్చని కొందరు చెబుతున్నారు. హాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చాలామంది సెలెబ్రిటీలు దీన్ని ఫాలో అవుతున్నారు. ఆ స్టార్లను అభిమానించే వాళ్లు సైతం ఈ విధానానికి జై కొడుతున్నారు. ఈ పద్ధతిలో బరువు తగ్గడం సాధ్యమేనా అంటే.. భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

## కీడే ఎక్కువ

మొదట్లో బరువు తగ్గినట్టు అనిపించినా, మోనోడైట్ వల్ల నష్టాలే ఎక్కువ అంటున్నారు పోషకాహార నిపుణులు. 'ఈ డైట్ వల్ల శరీరానికి కావాల్సిన అన్ని పోషకాలూ అందవు. ఫలితంగా దీర్ఘకాలంలో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి' అని హెచ్చరిస్తున్నారు.అంతేకాదు,మోనోడైట్ వల్ల శరీర మెటబాలిజం మందగిస్తుంది. సరైన ప్రొటీన్లు, ఫైబర్ లేని ఆహారం వల్ల కండరాల శక్తి తగ్గుతుంది. బరువు తగ్గడం మాట అటుంచితే.. జీవక్రియలు పట్టు తప్పే ప్రమాదం ఉందంటున్నారు. పైగా, ఈ తరహా డైట్‌ను మొదట్లో ఉత్సాహంగా పాటించినా.. పోనుపోనూ బోర్ కొట్టేస్తుంది. ఇలాంటి షరతులతో కూడిన డైట్ దీర్ఘకాలం కొనసాగించడం సాధ్యం కాదంటున్నారు నిపుణులు. మొండిగా పాటించినా.. మోనోడైట్ వల్ల ప్రయోజనాల కన్నా దుష్పరిణామాలే ఎక్కువని వాళ్లు తేల్చి చెబుతున్నారు.

## కొవ్వు కరగదు

కొన్ని రోజులపాటు ఈ డైట్ ఫాలో అయితే బరువు తగ్గినట్టు అనిపించవచ్చు. కానీ, ఇది ఎక్కువగా శరీరంలో నీటిని తగ్గిస్తుందే కానీ, కొవ్వును కరిగించదని నిపుణులు చెబుతున్నారు. మళ్లీ రెగ్యులర్ డైట్‌కు మళ్లినప్పుడు మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. కాబట్టి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, తగినంత శారీరక శ్రమ చేస్తుంటే.. క్రమపద్ధతిలో బరువు తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల, మోనోడైట్‌కు బదులుగా పోషకాలన్నీ సమతులంగా ఉండే ఆహారం తీసుకుంటేనే మేలు.

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 74వేల పాయింట్లకు పడిపోయింది. ప్రధాన బెంచ్‌మార్క్ సూచీలన్నీ ప్రారంభంలోనే లాభాలను కోల్పోయాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే.. సెన్సెక్స్ 74,392.54 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,401.11 గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 73,770.59 పాయింట్లకు చేరింది. చివరకు 200.85 పాయింట్ల నష్టంతో 73,828.91 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.30 తగ్గి.. 22,397.20 పాయింట్ల వద్ద స్థిరపడింది.

దాదాపు 1,463 షేర్లు పెరగ్గా.. 2,348 షేర్లు పతనమైంది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హిందాల్కో ఇండస్ట్రీస్ నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, సిప్లా, ఎన్‌టీపీసీ లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం తగ్గాయి. రంగాల వారీగా చూస్తే ఆటో, ఐటీ, మెటల్, మీడియా, రియాల్టీ 0.5శాతం నుంచి ఒకశాతం పతనం కాగా.. పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగాయి.

## హెూలీ సందడిలో కార్ల రక్షణ కీలకం..



**న్యూఢిల్లీ:** హెూలీ అంటే ప్రజలు సరదాగా గడుపుతూ రంగులతో తడిసి ముద్దవుతారు. కానీ సాధారణంగా హెరీలీ పండుగలో సందడి ఎలా ఉన్నా కార్ల యజమానులు మాత్రం చాలా భయపడుతూ ఉంటారు. కార్లపై పడిన రంగులు మచ్చలుగా మారి కారు అందాన్ని నాశనం చేస్తాయి. కారు రక్షణకు ఎన్ని చర్యలు తీసుకున్నా ఏదో రకంగా కారుపై రంగులు పడుతూ ఉంటాయి. కొన్ని మరకలైన ఎంతో నైపుణ్యం కలిగిన కార్ డిటెయిలర్లు తొలగించలేనంతగా మారతాయి.

**కారు రక్షణ:** కారుపై రంగులు పడిన తర్వాత వాటిని శుభ్రం చేయించుకునేందుకు కష్టపడే బదులు రంగులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కారును క్లోజ్‌డ్ షెడ్స్‌లో పార్క్ చేయడం మంచిదని సూచిస్తున్నారు. క్లోజ్‌డ్ షెడ్ అందుబాటులో లేకపోతే కారును పూర్తిగా కవర్ చేసేలా కారు కవర్‌ను ఉపయోగించడం మంచిది. ముఖ్యంగా హెరీలీ ఆడుతున్న జనసమూహాలకు దూరంగా కారును పార్క్ చేయడం ఉత్తమం.

**కారు వ్యాక్స్:** కారు కొనుగోలు చేసిన వెంటనే కారుకు వ్యాక్స్ చేయిస్తే ఇలాంటి సమయంలో రంగుల నుంచి రక్షణ లభిస్తుంది. కారు వ్యాక్స్ అంటే మైనం ద్వారా కారు పెయింట్ అదనపు రక్షణ పొరను జోడించడం. ఇలా చేస్తే ఏదైనా మరకలు పడితే వ్యాక్స్ చేసిన అవుటర్ పార్ట్ నుంచి మరకలను తొలగించడం సులభంగా ఉంటుంది. అంతేకాకుండా పక్షి రెట్టలు, ఎండ నుంచి అదనపు రక్షణ లభిస్తుంది.

**విండోలను రోల్ అప్ చేయడం:** మీరు కారును ఎక్కడ పార్క్ చేసినా కిటికీలను పైకి లేపడానికి చాలా ప్రాథమిక విధానాన్ని అనుసరించడం మంచిది. హెరీలీకి మాత్రమే కాకుండా అన్ని సమయాల్లో ఇదే విధానం అనుసరించడం ఉత్తమం. అయితే కిటికీలను పైకి లేపడం వల్ల రంగు, నీరు కారు క్యాబిన్‌లోకి ప్రవేశించడానికి అనుమతి ఉండదు. అలాగే దుమ్ము, కీటకాలు నుంచి రక్షణ ఉంటుంది.

**ఇంటీరియర్ రక్షణ:** హెూలీ సంబరాల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ తడిసిన దుస్తులను ధరించి కారులోకి ఎక్కకూడదు. కాబట్టి వీలైనంతగా దుస్తులను మార్చుకుని కారు ఎక్కడం ఉత్తమం. కుదరని పక్షంలో మీ కారు సీట్లను టవల్‌తో కప్పి వినియోగించడం ఉత్తమం. హెూలీ రంగుల వల్ల ఇబ్బంది లేకుండా డాష్ బోర్డ్‌ను క్లింగ్ ర్యాప్ లేదా ప్లాస్టిక్ షీట్‌తో కప్పాలి.

కారును వెంటనే కడగడం: మీ వాహనం బయట లేదా లోపలి భాగంలో మరకలు పడితే వీలైనంత త్వరగా కారును బాగా కడగాలి. షాంపూతో పాటు నీటి సాయంతో వెంటనే శుభ్రం చేస్తే మచ్చల పడకుండా ఉంటాయి. అలాగే ఇంటీరియర్ విషయంలో తగిన జాగ్రత్తలతో క్లీన్ చేయడం ఉత్తమం.

## కార్ల బుకింగ్‌కూ తత్కాల్ స్కీమ్..

### దేశంలో 35 ఏళ్ల క్రితమే అమలు




**న్యూఢిల్లీ:** మారుతి సుజుకీ 800 వెర్షన్ కారుకు గతంలో ప్రత్యేకంగా తత్కాల్ వేరియంట్ లాంచ్ చేశారు. 1989-1990 లలో మారుతి సుజుకి 800 అధిక డిమాండ్ నేపథ్యంలో ఆ కంపెనీ ఈ ప్రత్యేకమైన వెర్షన్ రిలీజ్ చేసింది. దీర్ఘకాల కస్టమర్ నిరీక్షణ కాలాన్ని తగ్గించడానికి దీనిని భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. మారుతి సుజుకి 800 కొనుగోలు చేయాలనుకునే కస్టమర్లు కొన్నిసార్లు చాలా నెలలు లేదా సంవత్సరాల వరకు వేచి ఉండాల్సి వచ్చేది. ఆ అవసరం లేకుండా ఫాస్ట్-ట్రాక్ లేదా ఇన్‌స్టంట్ డెలివరీ ఎంపికగా తత్కాల్ వేరియంట్ ప్రవేశపెట్టారు. మారుతీ సుజుకీ 800 టీకే వేరియంట్ పేరుతో రిలీజ్ చేసిన ఈ కారు పొందాలంటే కస్టమర్లు రూ. 50,000 అధిక ధర చెల్లించాల్సి వచ్చేది.

అయితే మారుతీ సుజుకీ టీకే వేరియంట్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేది కాదు. ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా కాలానుగుణంగా ప్రవేశపెట్టేరు. మారుతీ సుజుకీ 800 తత్కాల్ వేరియంట్ ప్రామాణిక మారుతి 800కి సమానంగా ఉంటుంది. తత్కాల్ పథకాన్ని మొదట స్టాండర్డ్ (ఎస్‌టీడీ) మోడల్ కోసం అందించారు. తరువాత డీలక్స్ (డీఎక్స్) వేరియంట్‌కు విస్తరించారు. మారుతీసుజుకీ టీకే వేరియంట్‌లో ఏసీ ఆప్షన్ కూడా ఉండేది. అయితే డీఎక్స్, ఎస్టీడీ వేరియంట్‌లు ఫాబ్రిక్ సీట్లు, డోర్ ట్రిమ్‌లు, స్ప్లిట్ రియర్ సీట్లు, లామినేటెడ్ విండ్‌షీల్డ్‌తో వచ్చాయి. తత్కాల్ వాహనాలను ప్రత్యేకంగా గుర్తించేలా బూట్ క్యాప్‌పై టీకే స్టిక్కర్ ఉండేది. మారుతీ సుజుకీ 800 కారు 796 సీసీ ఎఫ్8బీ ఇంజిన్‌తో వచ్చేది. అందువల్ల ఈ కారు 5,500 ఆర్‌పీఎం వద్ద 39.5 బీహెచ్‌పీ, 5000 ఆర్‌పీఎం వద్ద 59 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు 4-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ ఆధారంగా పని చేసేది.

మారుతి సుజుకి 800 భారతదేశంలో మొట్టమొదటి సరసమైన ధరలో లాంచ్ చేసిన కారుగా ఉండేది. ఈ కారు బాగా ప్రజాదరణ పొందడంతో డిమాండ్ సరఫరాను మించిపోయింది. అందువల్ల కారు కొనుగోలు చేయాలనుకునే వారు ఎక్కువ కాలం వేచి ఉండాల్సి వచ్చింది. మారుతి 800 బుకింగ్‌లకు చాలా కాలంగా వెయిటింగ్ లిస్ట్‌లు ఉండటం వల్ల ప్రజలు తమ బుకింగ్ స్లాట్‌లను అధిక ధరకు అమ్మేసుకునే వారు. ఇలాంటి సమస్యకు పరిష్కారంగా తత్కాల్ వేరియంట్ లాంచ్ చేశారు. కాలక్రమేణ తత్కాల్ వేరియంట్ మారుతీ సుజుకీ నిలిపివేసింది. అయితే ఇప్పటికీ కార్ల బుకింగ్‌ల కోసం ఓ ప్రత్యేక తత్కాల్ వేరియంట్‌ను లాంచ్ చేసిన మోడల్‌గా మారుతీ సుజుకీ 800 నిలుస్తుంది.

# తొలి ఎడిషన్ ఫైనలిస్టుల మధ్యే..

### డబ్ల్యూపీఎల్ 2025 ఫైనల్

**డబ్ల్యూపీఎల్ 2025 ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌ను ముంబై ఇండియన్స్ ఓడించింది. దీంతో ఈ లీగ్‌లో రెండోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మార్చి 15న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. కాగా ఇది డబ్ల్యూపీఎల్ మూడో ఎడిషన్. తొలి సీజన్‌లో ముంబై, రెండో సీజన్‌లో ఆర్సీబీ టైటిల్ సాధించింది. ఆ రెండు సార్లూ కూడా రన్నరప్‌గా ఢిల్లీ క్యాపిటల్స్ నిలవడం గమనార్హం.**

**ముంబై:** మహిళల ప్రీమియర్ లీగ్ 2025 ఫైనలిస్టులు ఎవరో తేలిపోయింది. లీగ్ దశలో సత్తాచాటి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఇది వరకే ఫైనల్ చేరిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం జరిగిన ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించిన ముంబై ఇండియన్స్ ఈ లీగ్‌లో రెండోసారి ఫైనల్ చేరింది. ఆరంభ ఎడిషన్‌లో టైటిల్ సాధించిన ముంబై.. రెండో టైటిల్ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా మరోసారి తుది పోరుకు దూసుకెళ్లింది.

ముంబై వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి.. 20 ఓవర్లలో 213/4 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ జట్టు బ్యాటర్లలో హేలీ మాథ్యూస్ (77), నాట్ సీవియర్ బ్రంట్ (77) సత్తాచాటారు. చివర్లో హర్మన్ ప్రీత్ కౌర్ 12 బంతుల్లో 36 రన్స్ స్కోరు చేసి.. ముంబైకి అనూహ్యమైన స్కోరును అందించింది.




ఆ తర్వాత భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ జెయింట్స్‌కు పేలవ ఆరంభం లభించింది. టాప్ ఆర్డర్ విఫలం కావడంతో ఆ జట్టు.. 43 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. దీంతో రన్‌రేట్ తగ్గి.. సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరుగుతూ పోయింది. ముంబై బౌలర్లు వరుసగా వికెట్లు తీయడంతో చివరకు 19.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌట్ అయింది.

కాగా మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో ముంబై, గుజరాత్ జట్లు ఇప్పటివరకు ఏడు మ్యాచ్‌లలో తలపడ్డాయి. అయితే ఒక్క మ్యాచ్‌లో కూడా గుజరాత్.. ముంబైని ఓడించలేకపోయింది. అన్నింట్లోనూ ముంబై జట్టే విజయం సాధించింది. ఇక ఈ ఫలితంతో ముంబై ఇండియన్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మార్చి 15న ముంబై వేదికగా ఫైనల్ జరగనుంది. డబ్ల్యూపీఎల్ తొలి ఎడిషన్‌లో కూడా ఈ రెండు జట్ల మధ్యే ఫైనల్ జరిగింది. అందులో ముంబై గెలిచింది.



## ఐపీఎల్‌లో ఆడేందుకు మిచెల్ మార్ష్‌కు గ్రీన్ సిగ్నల్..!




### కేవలం బ్యాట్స్‌మెన్‌గా లక్నో తరఫున బరిలోకి..!

**ముంబై:** ఐపీఎల్-2025 సీజన్‌లో ఆడేందుకు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ అనుమతి లభించింది. అయితే, కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే ఆడనున్నాడు. ఈ సీజన్‌లో మిచెల్ మార్ష్ లక్నో సూపర్‌జెయింట్స్ తరఫున బరిలోకి దిగనున్నాడు. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఆడుతాడా? లేదా? అన్నది అనుమానాస్పదంగా ఉండగా.. నిపుణులతో చర్చించిన తర్వాత లక్నో జట్టు తరఫున ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లుగా ఓ నివేదిక పేర్కొంది. రీహాబిలిటేషన్, వైద్య పరీక్షల అనంతరం ఈ ఆల్‌రౌండర్‌కు షరతులతో కూడిన అనుమతి వచ్చింది. అతను బౌలింగ్ చేయొద్దని.. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో వీపుపై ఎక్కువగా ఒత్తిడిపడకుండా చూసుకోవాలని స్పెషలిస్ట్ అడ్వైజ్ ఇచ్చాడు.

ఈ క్రమంలో మిచెల్ మార్ష్ కేవలం లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే ఆడనున్నాడు. మార్ష్ చాంపియన్స్ ట్రోఫీ జట్టులో ఈ ఆల్‌రౌండర్ లేకపోవడంతో ఆ లోటు కనిపించింది. గత కొంతకాలంగా పరిమిత ఓవర్ల క్రికెటర్‌లో మార్ష్ కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు. మార్ష్ బ్యాటింగ్, బౌలింగ్‌లో ఇబ్బందుపడుతున్న నేపథ్యంలో భారత్‌తో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చివరి మ్యాచ్‌లో తుది జట్టు నుంచి తప్పించారు. అతని స్థానంలో బ్యూ వెబ్‌స్టర్‌కు చోటు కల్పించారు. మిచెల్ మార్ష్ జనవరిలో జరిగిన బిగ్ బాష్ లీగ్‌లో కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఆడాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉన్నాడు. తాజాగా ఐపీఎల్‌లో ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది.

## ఇంగ్లాండ్ క్రికెటర్‌కు బీసీసీఐ షాక్..






### ఐపీఎల్ నుండి రెండేళ్ల పాటు నిషేధం

### హ్యారీ బ్రూక్‌పై నిషేధం విధిస్తూ నిర్ణయం

### ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డుకు సమాచారం అందించిన బీసీసీఐ

### కొత్త నిబంధనల ప్రకారం ఇంగ్లాండ్ క్రికెటర్‌పై చర్యలు

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయనను ఐపీఎల్ నుండి రెండేళ్ల పాటు నిషేధించింది. ఐపీఎల్ వేలంలో హ్యారీ బ్రూక్‌ను ఢిల్లీ డేర్ డెవిల్స్ కొనుగోలు చేసింది. వ్యక్తిగత కారణాలతో మ్యాచ్‌లు ఆడటానికి అతను రాలేదు. దీంతో బ్రూక్‌పై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డుకు ఇందుకు సంబంధించి బీసీసీఐ సమాచారాన్ని అందించిందని తెలుస్తోంది. బీసీసీఐ కొత్త నిబంధనల ప్రకారం, వేలంలో అమ్ముడుపోయిన ఆటగాడు సరైన కారణం లేకుండా ఐపీఎల్ నుండి వైదొలిగితే రెండేళ్ల పాటు నిషేధం విధిస్తారు. ఢిల్లీ ఫ్రాంచైజీ ఈ ఇంగ్లాండ్ బ్యాటర్‌ను ఐపీఎల్ 2025 వేలంలో రూ.6.2 కోట్లకు కొనుగోలు చేసింది. గత ఏడాది తన అమ్మమ్మ మృతి చెందడంతో కుటుంబంతో ఉండటానికి ఐపీఎల్ సీజన్‌కు దూరమయ్యాడు.

# వాకింగ్ బూట్‌తో రాహుల్ ద్రావిడ్.. ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్న ఆర్‌ఆర్ కోచ్..

**జైపూర్:** రాజస్థాన్ రాయల్స్ కోచ్ రాహుల్ ద్రావిడ్ గాయపడ్డ విషయం తెలిసిందే. ఈ యేటి ఐపీఎల్ సీజన్ ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో.. అతను ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. అయితే ఎడమ కాలుకు .. మెడికల్ వాకింగ్ బూట్ వేసుకుని అతను గ్రౌండ్‌కు వచ్చాడు. జైపూర్‌లో జరుగుతున్న ట్రైనింగ్ క్యాంపుకు.. వాకింగ్ బూట్‌తోనే వచ్చాడు. వారం క్రితం బెంగుళూరులో క్లబ్ క్రికెట్ ఆడుతున్న సమయంలో రాహుల్ ద్రావిడ్ గాయపడ్డాడు. రాజస్థాన్ రాయల్స్ రాహుల్ ద్రావిడ్‌కు చెందిన వీడియోను పోస్టు చేసింది. ద్రావిడ్ త్వరగా కోలుకుంటున్నట్లు ఆ పోస్టులో చెప్పారు.

ఎడమ కాలుకు వాకింగ్ బూట్ ఉన్నా.. ద్రావిడ్ మాత్రం చురుకుగా ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఆ జట్టు క్రికెటర్లతో హ్యాండ్ షేక్ చేశడు. కొందరు ఆటగాళ్లతో డిస్కషన్ చేశాడు. రియాన్ పరాగ్, యశస్వి





జైస్వాల్‌తో ముచ్చటించాడు. బుధవారం జరిగిన శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిగా వీక్షించాడు ద్రావిడ్. సోషల్ మీడియా యూజర్లు ద్రావిడ్ కమిట్‌మెంట్‌ను మెచ్చుకున్నారు.

టీమిండియా మాజీ క్రికెటర్, హెచ్ కోచ్ ద్రావిడ్.. ఫిబ్రవరి 22వ తేదీన జరిగిన కేఎస్సీఏ గ్రూప్ 1 విజిన్ లీగ్ మ్యాచ్‌లో ఆడాడు. ఆ మ్యాచ్‌లో అతని కుమారుడు అన్వయ్‌తో కలిసి అతను ఫీల్డ్‌లోకి దిగాడు. విజయ క్రికెట్ క్లబ్ తరఫున అతను 50 ఓవర్ల మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో ద్రావిడ్ 6వ స్థానంలో బ్యాటింగ్ చేశాడు. 8 బంతుల్లో 10 రన్స్ చేశాడు. ద్రావిడ్, అన్వయ్ అయిదో వికెట్‌కు 17 రన్స్ జోడించారు. ఆ తర్వాత మరో సారి రెండవ మ్యాచ్ ఆడుతున్న సమయంలో ద్రావిడ్ గాయపడ్డాడు. కుమారుడు అన్వయ్‌తో కలిసి క్రీజ్‌లో ఉన్నప్పుడే ద్రావిడ్ కాలికి గాయమైంది.




టాకీస్: మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అందాల భామ అనుపమ పరమేశ్వరన్ వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఓ వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే .. మరో వైపు లేడీ ఓరియెంటడ్ సినిమాలతో ఆకట్టుకుంటుంది. అనుపమ పరమేశ్వరన్ ఫిబ్రవరి 1996లో కేరళలోని త్రిసూర్‌లో జన్మించారు. 2015లో అల్ఫోన్స్ పుత్రన్ దర్శకత్వం వహించిన ప్రేమమ్ చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది. మొన్నటి వరకు సినిమాల్లో పద్ధతిగా కనిపించిన ఈ భామ ఇటీవల గ్లామర్ గేట్లు ఎత్తేసింది.

# అనుపమ పరదా సినిమాలో సమంత గెస్ట్‌రోల్?




మొన్నామధ్య వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ తన అందాలతో కవ్వించింది. సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో ఒకరిగా పాపులర్ అయిన అనుపమ.. ప్రస్తుతం తెలుగులో పరదా అనే చిత్రంలో నటిస్తుంది. అలాగే తమిళంలో మరిసెల్వరాజ్ దర్శకత్వంలో నటుడు ధ్రువ్ విక్రమ్ నటించిన బైసన్ సినిమాలో నటిస్తుంది. అలాగే రీసెంట్ గా అశ్వంత్ మరిముత్తు దర్శకత్వంలో నటుడు ప్రదీప్ రంగనాథన్ జోడిగా డ్రాగన్ అనే చిత్రంలో నటిస్తుంది. సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే తాజాగా అనుపమ సినిమా పరదా సినిమాలో ఓ సర్ ప్రైజ్ ఉంటుందని తెలుస్తుంది. పరదా సినిమాలో ఓ స్టార్ హీరోయిన్ కూడా నటిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ హీరోయిన్ ఎవరో కాదు. సౌత్ స్టార్ బ్యూటీ సమంత. ఫిలిం సర్కిల్‌లో వినిపిస్తున్న వార్తల ప్రకారం పరదా సినిమాలో సమంత ఓ కీలక పాత్రలో కనిపించనుందని అంటున్నారు. గతంలో అనుపమ సమంత ప్రధాన పాత్రలో నటించిన అఆ సినిమాలో నటించిన విషయం తెలిసిందే. అనుపమకు ఇదే తెలుగులో మొదటి సినిమా. ఆతర్వాత ఇప్పుడు మరోసారి అనుపమ, సమంత కలిసి స్క్రీన్ పై సందడి చేయనున్నారని అంటున్నారు. మరి ఈ వార్తల్లో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది.

# ప్రభాస్ అంటే ఆమాత్రం క్రేజీ ఉంటుంది..?

**21 సలార్ రీరిలీజ్... అప్పుడో బుక్ అయిపోయిన టికెట్స్**

**టాకీస్:** కృష్ణంరాజు నట వారసుడిగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రభాస్ తన క్రేజ్‌ని అమాంతం పెంచుకుంటున్నాడు. మధ్యలో కొన్ని ఫ్లాపులు పలకరించిన తర్వాత వరసగా హిట్స్ అందుకుంటున్నాడు. బాహుబలి సినిమాతో వరల్డ్ వైడ్ గా అభిమానులను సంపాదించుకున్న ప్రభాస్.. సలార్, కల్కి సినిమాలతో సూపర్ సక్సెస్ అందుకొని తన సత్తా ఏంటో నిరూపించాడు. ఇక ప్రభాస్ తన తర్వాతి సినిమాల లైనప్ చూస్తే దుమ్ము రేపడం ఖాయం. ప్రస్తుతం మారుతితో రాజా సాబ్ అనే సినిమా చేస్తున్న ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత సందీప్ రెడ్డితో 'స్పిరిట్'.. సలార్ 2, కల్కి 2 చిత్రాలలో నటించనున్నారు. ఇక ప్రభాస్ నటించిన సలార్ చిత్రం ఎంత పెద్ద హిట్టైందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమా భారీ యాక్షన్ డ్రామాగా రూపొంది ప్రభాస్ అభిమానులకి మంచి ఫీస్ట్ అందించింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 21న రీరిలీజ్ చేయబోతున్నారట. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. పది అంటే




పది నిమిషాల్లో థియేటర్లో నాలుగు షో టికెట్స్ సేల్ కావడం అందరిని ఆశ్చర్యపరిచింది. హైదరాబాద్ సిటీలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ థియేటర్లలో సుదర్శన్ హాలులో సలార్ చిత్రం రీరిలీజ్ అవుతుంది. ఈ థియేటర్‌లో సినిమా చూడడం ఒక అనుభూతి మాదిరిగా ఉంటుంది. అందులో ప్రభాస్ సినిమా చూస్తే ఆ థ్రిల్లే వేరు. అందుకే జనాలు సలార్ సినిమా రీరిలీజ్ చూసేందుకు ఎగబడుతున్నారు. ఈ సినిమా కలెక్షన్స్ విషయంలో సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయడం ఖాయం అంటున్నారు. ప్రస్తుతం ప్రభాస్ రెండు పడవల మీద ప్రయాణం చేస్తున్న విషయం తెలిసిందే . ఒక వైపు మారుతి దర్శకత్వం వహిస్తున్న 'ది రాజా సాబ్' చిత్రీకరణలో పాల్గొంటూనే మరొక వైపు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఫౌజీ షూటింగ్ పూర్తి చేస్తున్నాడు. కొన్ని రోజులు ఒక సినిమా ఇంకొన్ని రోజులు వేరే సినిమా చేస్తున్నాడు. ఇవి రెండు పూర్తయ్యాక సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా చేయనున్నట్టు తెలుస్తుంది. అయితే స్పిరిట్ సినిమా చేసే సమయంలో సందీప్ పూర్తిగా ప్రభాస్‌ని లాక్ చేయనున్నాడు. ఇక ఈ మూవీ తర్వాతే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' సీక్వెల్, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ చేయనున్నాడని అంటున్నారు.

# చాహల్‌తో డేటింగ్ రూమర్స్..

**ఆసక్తికర పోస్ట్ పెట్టిన మహ్‌వశ్**

**టాకీస్:** డాన్సర్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ ధనశ్రీ వర్మతో విడాకుల అనంతరం టీమ్ ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మళ్లీ ప్రేమలో పడ్డట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. యూట్యూబర్, రేడియో జాకీ మహ్‌వశ్ తో చాహల్ డేటింగ్‌లో ఉన్నట్లు బీ టౌన్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్‌గా దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను వీరిద్దరు కలిసి చూడడం.. మ్యాచ్‌కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేయడం వలన ఈ వార్తలకు బలం చేకురింది. దీంతో చాహల్ మహ్‌వశ్‌తో ప్రేమలో పడ్డట్లు






టాక్ నడుస్తుంది. ఇదిలావుంటే మహ్‌వశ్ పెట్టిన ఒక పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఇన్‌స్టా వేదికగా మహ్‌వశ్ స్టోరీ పెడుతూ.. రీసెంట్‌గా తనకు బెస్ట్ ఇన్‌ఫ్లూయెన్సర్ అవార్డు రావడంపై స్పందించింది. "నేను ఈ స్థాయికి చేరడం చూస్తే చిన్నప్పటి మహ్‌వశ్ ఎంతో సంతోషిస్తుంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఎలాంటి తప్పులు చేయకుండా, అసత్యాలను లెక్కచేయకుండా, మనం మన పనిని నిజాయితీగా చేస్తూ ముందుకు వెళ్లాలి." అంటూ రాసుకోచ్చింది. అయితే డేటింగ్ రూమర్స్ వస్తున్న వేళ మీడియాకు కౌంటర్‌గా మహ్‌వశ్ ఈ పోస్ట్ పెట్టినట్లు తెలుస్తుంది.

# రెండేండ్ల నిరీక్షణకు తెర..

**ఓటీటీలోకి వచ్చేసిన అఖిల్ 'ఏజెంట్'**



టాకీస్: అక్కినేని అఖిల్ ప్రధాన పాత్రలో నటించిన 'ఏజెంట్' చిత్రం ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. హోలీ పండుగ కానుకగా మార్చి 14న స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించిన సోనిలివ్ ఒకరోజు ముందుగానే ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేసింది. ప్రస్తుతం ఈ చిత్రం సోనీ లివ్ వేదికగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. అఖిల్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాకు సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించగా.. సాక్షి వైద్య కథానాయికగా నటించింది. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో నటించారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం 2023 ఏప్రిల్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి డిజాస్టర్ అందుకుంది. ఈ సినిమా ఇచ్చిన ఎఫెక్ట్‌కి సురేందర్ రెడ్డి, అఖిల్ ఇంకో సినిమాకు కూడా సంతకం చేయలేదంటే ఆ సినిమా డిజాస్టర్ ఎంత ఇంపాక్ట్ చూపించిందో అర్థం చేసుకోవచ్చు.
గతంలో ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ప్రకటించినప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తూ వచ్చారు. ఇక గత రెండు ఏండ్లుగా ఊరిస్తున్న ఈ చిత్రం ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. ఈ సినిమా చూద్దామనుకున్న మూవీ లవర్స్ ఆలస్యం చేయకుండా చూసేయండి మరి.

# కిల్లర్ హీరోయిన్‌కు కర్ణాటక స్టేట్ అవార్డు


టాకీస్: తెలుగులో వరుస చిత్రాలతో తన సత్తాను చాటుతోంది కన్నడ నాయిక జ్యోతి పూర్వజ్. ఆమె ప్రస్తుతం సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'కిల్లర్' లో నటిస్తోంది. విశేషం ఏమంటే ఆమె నటించిన కన్నడ చిత్రం 'వర్ణపతల' కర్ణాటక స్టేట్ ఫిల్మ్ అవార్డులో రెండవ ఉత్తమ చిత్రంగా నిలచించింది. ఈ అవార్డు రావడం పట్ల జ్యోతి పూర్వజ్ హర్షం వ్యక్తం చేయగా, 'కిల్లర్' టీమ్ ఆమెను అభినందించింది. 'శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ ను ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ ప్రస్తుతం కిల్లర్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో పూర్వాజ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతి పూర్వజ్ హీరోయిన్ గా నటిస్తోంది. విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. థింక్ సినిమా బ్యానర్ పై ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థలతో కలిసి పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి దీనిని నిర్మిస్తున్నారు. 'కిల్లర్' పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది.



**తెలుగువారికి నన్ను దగ్గర చేసిన సినిమా**

# యుగానికి ఒక్కడు : కార్తీ

టాకీస్: తమిళ నటుడు కార్తీ నటించిన క్లాసిక్ చిత్రాలలో 'యుగానికి ఒక్కడు' (తమిళంలో 'ఆయిరత్తిల్ ఒరువన్') ఒకటి. సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని డ్రీమ్ వ్యాలీ కార్పొరేషన్ బ్యానర్‌పై ఆర్. రవీంద్రన్ నిర్మించారు. కార్తీ, రీమా సేన్, ఆండ్రియా జెరెమయ్యా ప్రధాన పాత్రల్లో నటించారు. హిస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రం 2010లో విడుదలై తమిళంతో పాటు తెలుగులో సూపర్ హిట్ అందుకుంది. ఇక ఇదే సినిమాతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నటుడు కార్తీ. అయితే ఇదే సినిమాను దాదాపు 15 ఏండ్ల సంవత్సరాల తర్వాత మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. మార్చి 14న ఈ చిత్రం రీ రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా రీ రిలీజ్ ప్రమోషన్స్‌లో పాల్గొన్నాడు కార్తీ. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. నన్ను తెలుగువారికి దగ్గర చేసిన చిత్రం యుగానికి ఒక్కడు. నేను ఎన్నో సినిమాలు చేసిన కూడా



యుగానికి ఒక్కడు చిత్రం నా కెరీర్‌లో టాప్‌లో ఉంటుంది. దాదాపు 3 ఏండ్లు పగలు రాత్రి కష్టపడి చేసిన సినిమా అది. ఇది బాక్సాఫీస్ ట్రెండ్ సెట్టర్. ఈ మూవీ మ్యూజిక్ పరంగా కావచ్చు, సౌండ్ ఎఫెక్ట్స్, విజువల్ ఎఫెక్ట్స్ ఇలా అన్ని విభాగాలలో సత్తా చాటింది. ఈ సినిమాలో వచ్చిన ఎవర్రా మీరంతా అనే డైలాగ్ ప్రస్తుతం ఒక ట్యాగ్‌లైన్‌గా మారిపోయింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.